విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :187 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 22 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి!



- దేశ ఆలోచనా విధానంలో మార్పుతోనే అభివృద్ధి సాధ్యం: ప్రధాని మోదీ
- ఐఐటీ ఖరగ్‌పుర్ వజ్రోత్సవాల్లో ప్రసంగం..
- అంతరిక్ష, సెమీకండక్టర్ రంగాల్లో పురోగతిపై ప్రస్తావన
- పేదరికంపై ఆలోచనా విధానంలో మార్పు



కశ్మీర్ లోయలో ఉగ్రవాదులే లేరు!

- ఆర్టికల్ 370 రద్దుతో వేర్పాటువాదానికి ముగింపు
- పుల్వామా ఎన్‌కౌంటర్‌లో చివరి క్రియాశీల కశ్మీరీ ఉగ్రవాది హతం
- అరుణాచల్ పోలీసులకు ప్రెసిడెంట్స్ పోలీస్ కలర్ ప్రదానం చేసిన కేంద్ర హోంమంత్రి



ఏ.కొండూరులో పులి కలకలం!

సురక్షితంగా పట్టుకోవాలి.. ప్రజలకు రక్షణ కల్పించాలి
అటవీ శాఖకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు
థర్మల్ డ్రోన్లు, ఏఐ కెమెరాలతో పులి కదలికలపై నిఘా
ఇతర రాష్ట్రాల నిపుణుల సహకారంతో ప్రత్యేక ఆపరేషన్

అమరావతి

ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు పరిసర అటవీ ప్రాంతాల్లో పులి సంచారం కలకలం రేపుతోంది. పులి కదలికలతో సమీప గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పులిని సురక్షితంగా పట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ - మిగతా3లో

కూటమి నిర్ణయమే అంతిమం

- మేల్కొనకపోతే రాజకీయ భవిష్యత్ కోల్పోతారు!
- ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు గట్టి హెచ్చరిక
- పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు
- స్థానిక ఎన్నికల ఫలితాలపై సమగ్ర సమీక్ష
- పదవుల కోసం అలకలు వద్దు.. కూటమి నిర్ణయమే ఫైనల్

అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు అధికార కూటమిలోని కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల్లో ఆదరణ తగ్గుతున్నా, పనితీరు మార్చుకోకుండా వ్యవహరిస్తే రాజకీయ భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధించని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు



ఇప్పటికైనా మేల్కొనాలని సూచించారు. ఎన్నికల ఫలితాలను ప్రతి నియోజకవర్గం వారీగా విశ్లేషిస్తామని, ప్రజల తీర్పును తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. పనితీరు మార్చుకోని వారిపై అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో కూటమి ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించకపోవడంపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు - మిగతా3లో


ఏపీకి రూ.38,362 కోట్ల పెట్టుబడులు!

- 20,398 మందికి ఉపాధి అవకాశాలు..
- పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో చర్చ
- కియాతో రూ.19 వేల కోట్ల పెట్టుబడి
- అచ్యుతాపురంలో గ్లాస్ తయారీ ప్లాంట్
- కియా, అదానీ, సెయింట్-గోబైన్ సహా పలు సంస్థల ప్రతిపాదనలు



100 రోజులైనా ముగియని పార్లమెంట్ సమావేశాలు!

- డీలిమిటేషన్ బిల్లు కోసమే జాప్యం.. మోదీ సర్కారుపై కాంగ్రెస్ విమర్శలు
- మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నాలు: జైరాం రమేశ్ ఆరోపణ
- ప్రస్తుత లోక్‌సభ స్థానాలతోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్



ప్రజల భాగస్వామ్యంతో గోదావరి పుష్కరాలు!

- 10 కోట్ల మంది భక్తుల రాకే లక్ష్యం
- రూ.3,723 కోట్లతో భారీ ఏర్పాట్లు
- 440 ఘాట్ల అభివృద్ధి.. 4 వేల ప్రత్యేక బస్సులు
- 1,560 ప్రత్యేక రైళ్లు.. 135 భాషల్లో ఏఐ చాట్‌బాట్
- పుష్కరాల ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి:

గోదావరి పుష్కరాలను కనీవినీ ఎరుగని రీతిలో వైభవంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సుమారు 10 కోట్ల మంది భక్తులు పుష్కరాలకు తరలివస్తారన్న అంచనాతో పకడ్బందీ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక సదుపాయాలు, రవాణా, భద్రత, వైద్య సేవలు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణలో ప్రభుత్వ శాఖల తో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాలు, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ మేరకు అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం 12 రోజుల పాటు జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకలకు దేశవ్యాప్తంగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో - మిగతా3లో



అయ్యప్ప భక్తులకు గుడ్ న్యూస్

- విమానం క్యాబిన్ లోకి ఇరుముడి తీసుకువెళ్లొచ్చు!
- విమానాల్లో ఇరుముడికి కేంద్ర పౌర విమానయాన శాఖ అనుమతి
- వరుసగా మూడో ఏడాది భక్తులకు వెసులుబాటు కల్పించిన కేంద్రం
- క్యాబిన్ బ్యాగేజీగా ఇరుముడి తీసుకెళ్లేందుకు గ్రీన్‌సిగ్నల్
- విమానాశ్రయాలు, సీఐఎస్ఎఫ్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు

కరవు సీమలో పరిశ్రమల జోరు



- రాయలసీమలో రిలయన్స్ భారీ పారిశ్రామిక అడుగు!
- 12 నెలల్లోనే ఉత్పత్తి ప్రారంభం..
- ఓర్వకల్లులో ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ కేంద్రం
- 10 ఉత్పత్తి లైన్లతో క్యాంపా కోలా, పండ్ల రసాలు, ప్యాకేజ్డ్ వాటర్ తయారీ
- 1,200 మందికి ప్రత్యక్షంగా ఉపాధి
- దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు కర్నూలు నుంచే సరఫరా



కల్తీ మద్యం మరణాలు ప్రమాదం కాదు.. ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం!

- బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- మణిపూర్‌లో విషాదం..
- 15 మంది మృతి, 150 మందికిపైగా ఆస్పత్రిలో చికిత్స
- బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి..
- దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

కూటమి నిర్ణయమే అంతిమం

-మొదటిపేజీ తరువాయి

నిర్వహిస్తున్నవారు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును విశ్లేషించుకుని ఎక్కడ తప్పులు జరిగాయో గుర్తించాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. కొందరు ప్రజాప్రతినిధుల పనితీరును ప్రజలు ఆమోదించడం లేదనే విషయాన్ని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ వ్యవహారశైలిని మార్చుకోవాలని హెచ్చరించారు.

ప్రతి ఫలితంపైనా సమీక్ష

స్థానిక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను నియోజకవర్గాల వారీగా పరిశీలించనున్నట్లు సీఎం స్పష్టం చేశారు. కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా, ఓటర్ల అభిప్రాయాలు, స్థానిక సమస్యలు, నాయకుల పనితీరు, కార్యకర్తలతో సమన్వయం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నప్పటికీ దాన్ని గుర్తించకుండా ముందుకు సాగితే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పార్టీకి నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

పంచాయతీ ఎన్నికలపై దృష్టి

రాబోయే పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ బలాన్ని పెంచుకోవడంతో పాటు ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించాలని ఆదేశించారు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు సైతం తమ పరిధిని దాటి వ్యవహరించకూడదని, బాధ్యతలను గుర్తుంచుకుని పనిచేయాలని సూచించారు.



పరిషత్ పీఠాల కోసం పంతాలు వద్దు

మరోవైపు కూటమిలో పరిషత్ పదవుల కేటాయింపు వ్యవహారం కూడా రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. జడ్పీ చైర్మన్, ఎంపీపీ పదవుల కోసం కొన్ని ప్రాంతాల్లో కూటమి పార్టీల నేతల మధ్య విభేదాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా కడప జడ్పీ చైర్మన్ పదవి విషయంలో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. శ్రీకాళహస్తి ఎంపీపీ పదవి విషయంలో టీడీపీ, బీజేపీ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నిక వాయిదా పడిన పరిస్థితి నెలకొంది. పరిషత్ పదవుల విషయంలో వ్యక్తిగత పట్టుదలకు తావులేదని, కూటమి సమష్టిగా తీసుకునే నిర్ణయమే అంతిమమని చంద్రబాబు స్పష్టం చేసినట్లు సమాచారం. పదవుల కోసం అలకలు ప్రదర్శించడం, బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం సరికాదని హితవు పలికారు. టీడీపీలోనూ కొందరు నేతలు పదవుల విషయంలో అసంతృప్తితో ఉన్నారని పేర్కొంటూ, వారికి కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. అయినప్పటికీ వైఖరి మార్చుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వ్యవహారశైలిపైనా అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలే

ఒకవైపు ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్ష, మరోవైపు కూటమి నేతల మధ్య పదవుల వివాదాలు.. ఈ రెండు అంశాలపై చంద్రబాబు స్పష్టమైన వైఖరి ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల్లో ఆదరణ పెంచుకోవడం, కార్యకర్తలకు అండగా నిలవడం, కూటమి ఐక్యతను కాపాడటం ఎమ్మెల్యేల ప్రధాన బాధ్యతలని అధిష్ఠానం భావిస్తోంది. ఎన్నికల ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా, పదవుల కోసం పరస్పరం విభేదిస్తే భవిష్యత్తులో రాజకీయంగా నష్టపోవాల్సి వస్తుందని చంద్రబాబు హెచ్చరించినట్లు తెలుస్తోంది.

ప్రజల భాగస్వామ్యంతో గోదావరి పుష్కరాలు!

-మొదటిపేజీ తరువాయి

ముందస్తు ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. పుష్కరాల నిర్వహణ కోసం 22 ప్రభుత్వ శాఖల పరిధిలో మొత్తం 4,862 పనులను ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.3,723 కోట్లకు పైగా వ్యయాన్ని అంచనా వేశారు. ఇప్పటివరకు రూ.2,051 కోట్ల విలువైన 2,260 పనులకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. పనులన్నీ నిర్దిష్ట గడువులో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు.

440 ఘాట్లలో మౌలిక సదుపాయాలు

గోదావరి పరివాహక ప్రాంతంలోని 440 ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. స్నానఘట్టాల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇప్పటికే రూ.649 కోట్ల విలువైన 659 పనులు ప్రారంభమయ్యాయి. పారిశుద్ధ్యం, తాగునీరు, లైటింగ్, మరుగుదొడ్ల ఏర్పాట్ల కోసం మరో రూ.464 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఘాట్ల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

పుష్కరాల సమయంలో భారీగా వాహనాలు, భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులను అభివృద్ధి చేయనున్నారు. సుమారు 268 కిలోమీటర్ల మేర బారికేడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలు, ఘాట్లకు చేరుకునే మార్గాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. రద్దీ ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టనున్నారు.

4 వేల బస్సులు.. 1,560 ప్రత్యేక రైళ్లు

భక్తుల రవాణా సౌకర్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. సుమారు 4 వేల ప్రత్యేక బస్సులతో పాటు 649 గ్రీన్ బస్సులను నడిపేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రైల్వే శాఖతో సమన్వయం చేసుకుని 1,560 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల నుంచి పుష్కర ఘాట్లకు చేరుకునేందుకు అనుసంధాన రవాణా సౌకర్యాలు కల్పించనున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు, రైళ్ల సంఖ్యను సర్దుబాటు చేయనున్నారు.

135 భాషల్లో ఏఐ చాట్‌బాట్ సేవలు

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పుష్కరాల నిర్వహణను మరింత సమర్థంగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఆధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు సమాచారం అందించేందుకు 135 భాషల్లో సేవలందించే ఏఐ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఘాట్ల వివరాలు, రవాణా మార్గాలు, వైద్య సేవలు, వసతి సౌకర్యాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని ఈ వ్యవస్థ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించనున్నారు. పుష్కరాల సమయంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకునేలా కమాండ్ కంట్రోల్ వ్యవస్థ పనిచేయనుంది.



వైద్య సేవలకు పెద్దపీట

పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా 100 పడకలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఘాట్ల సమీపంలో వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, అత్యవసర చికిత్సా కేంద్రాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోనున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలున్న భక్తులకు ప్రత్యేక వైద్య సహాయం అందించే విధంగా ప్రణాళికలు రూపొందించనున్నారు.

పోలవరం, కాటన్ బ్యారేజీ పనులపై దృష్టి

పుష్కరాల నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతంలో కీలకమైన సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల పనులను కూడా వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునికీకరణ పనులను 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పనులు పూర్తయితే గోదావరి ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

జలమార్గంలో ఫ్లోటింగ్ పంటూన్లు

రాజమహేంద్రవరం నుంచి పోలవరం వరకు సుమారు 40 కిలోమీటర్ల జలమార్గంలో ఆరు ఫ్లోటింగ్ పంటూన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. జలరవాణా సౌకర్యాలను వినియోగించుకోవడంతో పాటు పర్యాటక పరంగా కూడా ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ జలమార్గంలో అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేయనున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

పుష్కరాల సమయంలో గోదావరి నది కాలుష్యానికి గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నదిలో వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పించడం, ఘాట్ల వద్ద నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టనున్నారు. గోదావరి జలాల నాణ్యతను కాపాడటంతో పాటు పర్యావరణహిత పుష్కరాల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు.

ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

పుష్కరాలను కేవలం పుణ్యస్నానాలకే పరిమితం చేయకుండా ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని చాటేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గోదావరి నదీ హారతి, సామూహిక కూచిపూడి నృత్య ప్రదర్శనలు, దీపాలంకరణ, యోగా కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. స్థానిక కళాకారులు, సాంస్కృతిక సంస్థలు, యువతకు ఇందులో భాగస్వామ్యం కల్పించనున్నారు.

ప్రజల భాగస్వామ్యమే కీలకం

పుష్కరాల నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు సేవలందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారీ జనసందోహం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏపీకి రూ.38,362 కోట్ల పెట్టుబడులు!

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులు తరలివచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కియా, అదానీ ఎంటర్‌ప్రైజెస్, సెయింట్-గోబైన్ వంటి ప్రముఖ సంస్థలతో పాటు పలు కంపెనీలు రాష్ట్రంలో పరిశ్రమలు, హోటళ్లు, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆసక్తి చూపించాయి. మొత్తం రూ.38,362.12 కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు సమర్పించగా, వీటి ద్వారా 20,398 మందికి ఉపాధి లభించే అవకాశం ఉందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రతిపాదనలపై శుక్రవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ) సమావేశంలో చర్చించారు. విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన 'పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్' అనంతరం పలు కంపెనీలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నాయి. వాటిలో కొన్ని సంస్థలు ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రాథమిక చర్యలు ప్రారంభించాయి. కియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.19 వేల కోట్ల పెట్టుబడితో రెండో కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. 330.03 ఎకరాల్లో నిర్మించనున్న ఈ ప్లాంట్ ద్వారా 12 వేల మందికి ఉపాధి లభించనుంది. ప్రస్తుతం పెనుకొండ సమీపంలోని ప్లాంట్‌లో ఏటా 4.30 లక్షల కార్లు తయారవుతున్నాయి. కొత్త ప్లాంట్ అందుబాటులోకి వస్తే మరో 2 లక్షల కార్ల ఉత్పత్తి సామర్థ్యం పెరగనుంది. ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని కంపెనీ కోరింది.

శ్రీకాకుళంలో టైటానియం కాంప్లెక్స్

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ శ్రీకాకుళం జిల్లాలో రూ.13,667 కోట్ల పెట్టుబడితో సమీకృత టైటానియం కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. 2032 నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని, ఈ ప్రాజెక్టు ద్వారా 765 మందికి ఉపాధి కల్పిస్తామని సంస్థ తెలిపింది. ఈ కాంప్లెక్స్‌తో రాష్ట్రంలో టైటానియం ఆధారిత పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతుందని పేర్కొంది. సెయింట్-గోబైన్ సంస్థ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో రూ.1,800 కోట్లతో ఫ్లోట్ గ్లాస్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. రోజుకు 12 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మందికి ఉపాధి లభించనుంది. 2029 అక్టోబర్ నాటికి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఏటీసీ టైర్స్ సంస్థ అనకాపల్లి జిల్లాలోని తన ప్లాంట్‌ను విస్తరించేందుకు ముందుకొచ్చింది. 97.11 ఎకరాల్లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు రూ.1,047.47 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 2029 మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విస్తరణ ద్వారా 350 ఉద్యోగాలు కల్పించడంతో పాటు రోజువారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని 100 టన్నుల మేర పెంచనుంది.

చిత్తూరులో స్మార్ట్ గార్మెంట్ యూనిట్

ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్స్ గ్లోబల్ క్లోతింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చిత్తూరు జిల్లాలోని టెనెబండ గ్రామంలో స్మార్ట్ గార్మెంట్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. మూడు దశల్లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో మొదటి దశ నిర్మాణాన్ని 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని ద్వారా 3,103 మందికి ప్రత్యక్షంగా, 1,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని సంస్థ అంచనా వేసింది.

బయోగ్యాస్, పవన విద్యుత్ ప్రాజెక్టులు

ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలో ఆర్‌వీఏఎస్ రీజెన్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.66.50 కోట్ల పెట్టుబడితో రోజుకు 12 టన్నుల సామర్థ్యం గల కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 600 మందికి ఉపాధి లభించనుంది. జెంటారి రెన్యూవబుల్స్ ఇండియా క్యాప్టర్ వన్ ప్రైవేట్ లిమిటెడ్ నంద్యాల జిల్లా బేతంచెర్లలో రూ.1,722 కోట్ల పెట్టుబడితో 210 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది.

ఏ.కొండూరులో పులి కలకలం!

-మొదటిపేజీ తరువాయి

అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు కలగకుండా చూడటంతో పాటు పులికి కూడా హాని జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అటవీ శాఖ ఉన్నతాధికారులతో పులి సంచారం, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, తదుపరి కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు.

పులి కదలికలపై నిరంతర నిఘా

ఏ.కొండూరు పరిసరాల్లో పులి ఎక్కడెక్కడ సంచరిస్తోంది? ఏయే ప్రాంతాల్లో దాని అడుగుజాడలు కనిపించాయి? ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టారు? అనే అంశాలపై పవన్ కల్యాణ్ ఆరా తీశారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ దాని సంచార మార్గాలను గుర్తించాలని సూచించారు. పులి ఉన్న ప్రాంతాలపై స్పష్టమైన సమాచారం సేకరించి, సమీప గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

ఆధునిక సాంకేతికతతో ఆపరేషన్

పులి ఆచూకీని వేగంగా గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని పవన్ కల్యాణ్ సూచించారు. థర్మల్ డ్రోన్లు, ఏఐ ఆధారిత కెమెరా ట్రాప్‌లు, ఇతర ప్రత్యేక పరికరాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. పులి సంచార ప్రాంతాలను గుర్తించేందుకు సాంకేతిక నిపుణుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి అనుభవజ్ఞులైన పులి ట్రాకింగ్, రెస్క్యూ బృందాలను రప్పించాలని సూచించారు.

గ్రామాల్లో ముందస్తు అప్రమత్తత

పులి సంచరిస్తున్న అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు, వ్యవసాయ కూలీలకు పులి సంచారంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అటవీ శాఖ సిబ్బందితో నిరంతర గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు.

అధికారుల సమన్వయంతో ప్రత్యేక నిఘా

పులి ఆపరేషన్‌ను పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ స్వయంగా పర్యవేక్షించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. స్థానిక అటవీ శాఖ బృందాలతో పాటు ప్రత్యేక ట్రాకింగ్ బృందాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల అధికారుల సహకారంతో ముందుకు సాగాలని చెప్పారు. పరిస్థితులకు అనుగుణంగా గస్తీని విస్తరించి, పులి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని ఆదేశించారు.

ప్రజలకు, పులికి హాని జరగకూడదు

పులిని పట్టుకునే క్రమంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టాలు, నిర్దేశిత నిబంధనలు, రెస్క్యూ ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుభవజ్ఞులైన వన్యప్రాణి నిపుణుల పర్యవేక్షణలోనే ఆపరేషన్ నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూనే పులి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి

పులి సంచారంపై చేపడుతున్న చర్యలను నిరంతరం సమీక్షించాలని, పరిస్థితిలో చోటుచేసుకునే మార్పులను ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పులిని సురక్షితంగా పట్టుకునే వరకు అప్రమత్తత కొనసాగించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఏ.కొండూరు పరిసర గ్రామాల్లో అటవీ శాఖ నిఘా, గస్తీ చర్యలు మరింత విస్తరించే అవకాశం ఉంది.

కరవు సీమలో పరిశ్రమల జోరు..

కర్నూలు : ఒకప్పుడు కరవు, వలసలు, ఉపాధి లేమితో సతమతమైన రాయలసీమలో పారిశ్రామిక ప్రగతికి కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. పెట్టుబడులను ఆకర్షిస్తూ స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఏర్పాటు చేసిన భారీ పానీయాల తయారీ పరిశ్రమ ఉత్పత్తిని ప్రారంభించడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతేడాది నవంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన ఈ పరిశ్రమ కేవలం 12 నెలల్లోనే నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి దశకు చేరడం విశేషం. ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ ప్లాంట్‌గా పేర్కొంటున్న ఈ పరిశ్రమ రాయలసీమ పారిశ్రామిక చరిత్రలో కీలక ముందడుగుగా నిలవనుంది.

క్యాంపా బ్రాండ్‌కు రాయలసీమ కేంద్రం

దశాబ్దాలుగా భారతీయ వినియోగదారులకు పరిచయమైన క్యాంపా బ్రాండ్ ఇప్పుడు రాయలసీమ నుంచి కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. ఓర్వకల్లు ప్లాంట్‌లో క్యాంపా కోలా, వివిధ రకాల పండ్ల రసాలు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారు చేయనున్నారు. మొత్తం 10 ఉత్పత్తి లైన్లతో ఏర్పాటైన ఈ కేంద్రం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు కూడా ఉత్పత్తులను పంపించేందుకు ప్రణాళిక రూపొందించారు.

రూ.1,622 కోట్ల పెట్టుబడితో భారీ ప్లాంట్

ఈ పరిశ్రమ ఏర్పాటుకు రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సంస్థ సుమారు రూ.1,622 కోట్ల పెట్టుబడి పెట్టింది. ఓర్వకల్లు పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో ఈ యూనిట్‌ను అభివృద్ధి చేశారు. ప్రాజెక్టు ద్వారా 1,200 మందికి ప్రత్యక్షంగా, మరో 2,400 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు గతంలో వెల్లడించారు. ముఖ్యంగా రవాణా, గిడ్డంగులు, వ్యవసాయం, పండ్ల సేకరణ, సరఫరా వ్యవస్థ వంటి అనుబంధ రంగాలకు ఈ పరిశ్రమ ఊతమివ్వనుంది.

యువతకు సొంత జిల్లాలోనే ఉద్యోగాలు

ఈ పరిశ్రమ ప్రారంభంతో రాయలసీమ యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. నంద్యాలకు చెందిన మహేశ్ హరి, కర్నూలుకు చెందిన ఆర్.కె. స్ఫూర్తి వంటి యువత ఇప్పటికే ఈ పరిశ్రమలో పనిచేస్తున్నారని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి మారాలని, పరిశ్రమలే యువత ఉన్న ప్రాంతాలకు రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానికులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ఈ తరహా పరిశ్రమలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేసిన లోకేశ్

ఓర్వకల్లు ప్లాంట్ ప్రారంభంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటవడం గర్వకారణమని పేర్కొన్నారు. కేవలం 12 నెలల్లోనే నిర్మాణం నుంచి ఉత్పత్తి దశకు చేరడం రాష్ట్రంలో అమలవుతున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి నిదర్శనమని తెలిపారు. ఏపీపై నమ్మకంతో భారీ పెట్టుబడి పెట్టిన రిలయన్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాయలసీమ పారిశ్రామిక ముఖచిత్రంలో మార్పు

ఓర్వకల్లు ప్రాంతం ఇప్పటికే పలు భారీ పరిశ్రమల ఏర్పాటుతో పారిశ్రామిక కేంద్రంగా ఎదిగే అవకాశాలను కలిగి ఉంది. రిలయన్స్ పానీయాల తయారీ కేంద్రంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, సెమీకండక్టర్, ఇతర తయారీ రంగాల్లో పెట్టుబడుల ప్రతిపాదనలు కూడా ఈ ప్రాంత అభివృద్ధిపై అంచనాలను పెంచుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులకు స్థానికంగానే మార్కెట్ లభించడం, రవాణా రంగం విస్తరించడం, చిన్న పరిశ్రమలు ఏర్పడటం వంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

వలసలకు అడ్డుకట్ట.. ఉపాధికి కొత్త బాట

రాయలసీమలో పరిశ్రమల స్థాపన వేగవంతమైతే ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే యువతకు సొంత జిల్లాల్లోనే ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. స్థానిక వనరులను వినియోగించుకుంటూ పరిశ్రమలు అభివృద్ధి చెందితే రైతులు, రవాణా కార్మికులు, చిన్న వ్యాపారులు, సేవారంగాల వారికి కూడా ప్రయోజనం చేకూరుతుంది. ఓర్వకల్లు రిలయన్స్ ప్లాంట్ ఈ దిశగా కీలక ముందడుగుగా నిలుస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని పెట్టుబడులు కార్యరూపం దాల్చితే రాయలసీమ పారిశ్రామికంగా కొత్త గుర్తింపు పొందే అవకాశముంది.

ఎన్నికల వ్యూహం పై ఎమ్మెల్యేలు, కూటమి నేతలకు అచ్చెన్నాయుడు దిశానిర్దేశం.



- 60 డివిజన్లలో పక్కా వ్యూహంతో విస్తృత ప్రచారం చేపట్టాలి.
- కార్పొరేటర్లతో పాటు మేయర్ అభ్యర్థి అఖండ విజయమే లక్ష్యం.
- నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఎన్నికల సన్నాహక సమావేశం

కోటబొమ్మాళి, పెన్ సత్తా, నవంబర్ 21:శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి నాయకులు, కార్యకర్త సమష్టిగా పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపు నిచ్చారు. నగరం లోని ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి కూటమి అభ్యర్థులకు ఓటు అభ్యర్థించాలని సూచించారు. కార్పొరేటర్ అభ్యర్థులతో పాటు మేయర్ అభ్యర్థి అఖండ విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేన శాసనసభ్యులు వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, మేయర్ అభ్యర్థి డా. దానేటి శ్రీధర్, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, కూటమి ముఖ్య నాయకులు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణ, ప్రచార ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు. నగరం లోని 60 డివిజన్లలోనూ పక్కా వ్యూహంతో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలని మంత్రి సూచించారు. ప్రతి డివిజన్‌లో స్థానిక పరిస్థితులు, ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ రూపొందించు కోవాలన్నారు. మేయర్ అభ్యర్థితో పాటు అన్ని డివిజన్లలో కూటమి కార్పొరేటర్ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రచారంతోపాటు ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం చెప్పాలని, వారు లేవనెత్తుతున్న అంశాలను తేలిగ్గా తీసుకోకుండా వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ తేలిగ్గా తీసుకోవద్దని, ఒక్క ఓటు కూడా ఎంతో విలువైనదని పేర్కొన్నారు. ప్రచారంలో ప్రతి అంశానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు చేరువ కావాలన్నారు. కూటమి పార్టీల మధ్య ఐక్యత, సమన్వయమే ఎన్నికల కార్యాచరణలో కీలకమని మంత్రి పేర్కొన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన మద్దతు, విజయాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం సీట్లు, పరిషత్ ఎన్నికల్లో 96.4 శాతం సీట్లు కూటమి సాధించినట్లు గుర్తుచేశారు. బ్యాలెట్ అయినా, పోస్టల్ బ్యాలెట్ అయినా ఎన్నిక ఏదైనా ప్రజల తీర్పు కూటమికి అనుకూలంగా ఉందని తెలిపారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఎన్నికల బాధ్యతను స్వీకరించి క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజల మధ్య ఉండాలని, ప్రతి ఓటరును కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు కోరాలని మంత్రి పిలుపునిచ్చారు. 60 డివిజన్లలోనూ సమష్టి కృషి, సమన్వయం, పక్కా వ్యూహంతో ముందుకు సాగుతూ కార్పొరేటర్ అభ్యర్థులతో పాటు మేయర్ అభ్యర్థి అఖండ విజయానికి కృషి చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు.

ముత్యాల నాయుడికి గంటా నివాళులు.



విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 21: విశాఖ మేయర్ గా ఎన్నికైన ముక్కా శ్రావణి తండ్రి, టీడీపీ సీనియర్ నేత ముక్కా ముత్యాల నాయుడి పార్థివ దేహానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం నివాళులర్పించారు. పార్టీకి నాయుడు 4 దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను శ్లాఘించారు. నిఖార్సయిన కార్యకర్తకు ఆయన ఉదాహరణగా నిలిచారని పేర్కొన్నారు. నాయుడి క్రమ శిక్షణ అంకితభావాన్ని గుర్తించే అధిష్టానం కుమార్తె శ్రావణికి పార్టీ టికెట్ ఇచ్చి ప్రోత్సహించిందని చెప్పారు. నాయుడి మరణం టీడీపీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, శాఖారి శ్రీనివాస్, గరే సదానంద, పీవీ నరసింహం, నాగోతి సత్యనారాయణ, లొడగల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్య దినోత్సవ వేడుకలు.

జిల్లా మత్స్యశాఖ అధికారి ఎల్.బి.ఎస్. వర్ధన్.



అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 21: ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఉదయం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మత్స్యశాఖ అధికారి ఎల్.బి.ఎస్. వర్ధన్, సహాయ సంచాలకులు జి. విజయ, జిల్లా మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు గురునాదరావు, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మంగమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ ఏడాది ప్రపంచ మత్స్య దినోత్సవ థీమ్ “మార్పు కోసం ప్రజలకు సాధికారత -- మత్స్య, ఆక్వాకల్చర్ రంగాలలో ముఖ్యంగా యువత, మహిళలకు గౌరవప్రద మైన ఉపాధి అవకాశాల కల్పన” అనే అంశం పై వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి ఎల్.బి.ఎస్. వర్ధన్ మాట్లాడుతూ మత్స్యరంగంలో యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం అందించడం ఎంతో ముఖ్యమని వివరించారు. మత్స్య సంపద పరి రక్షణతో పాటు మత్స్యకారుల సంక్షేమం, స్థిరమైన మత్స్యరంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

సహాయ సంచాలకులు జి. విజయ మాట్లాడుతూ, మత్స్య సంపదను కాపాడుకోవడం ప్రతి మత్స్యకారుడి బాధ్యత అని, బాధ్యతాయుతమైన చేపల వేట పద్ధతులను పాటిస్తూ భవిష్యత్ తరాలకు మత్స్య సంపదను అందించాలని సూచించారు. అనంతరం

లబ్ధిదారులకు ద్విచక్ర వాహనాల పంపిణీ. కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎఎస్వై) పథకం కింద జనరల్ కేటగిరీకి చెందిన ఇద్దరు లబ్ధిదారులు పగి బాలరాజు, యర్రవారపు శివ లకు ఐస్‌బాక్స్‌తో కూడిన టీవీఎస్ ద్విచక్ర వాహనాలను అందజేశారు. చేపల రవాణా, విక్రయాలు, మత్స్యకారుల ఆదాయాభివృద్ధికి ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని మత్స్యకార సంఘాల అధ్యక్షులు, మత్స్యకారులు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు వివిధ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటు కోవాలి.

స్వచ్ఛమైన ఓటరు జాబితా, ఓటు హక్కు పై విద్యార్థులకు అవగాహన కల్పించాలి.

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 21: నవంబర్ 18 న అనకాపల్లి జిల్లా గవరపాలెం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎన్నికల పై అవగాహన పెంపొందించేందుకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. వ్యాసరచన పోటీలలో స్వచ్ఛమైన ఓటరు జాబితా ప్రాముఖ్యత, ఓటు హక్కు ప్రాముఖ్యత అనే అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను తెలపడం జరిగిందన్నారు. క్విజ్ పోటీలలో ఓటరు జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ, విపత్తుల పై అవగాహన, పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ వంటి అంశాల పై ప్రశ్నలు అడిగినట్లు పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని అన్నారు. స్వచ్ఛ మైన ఓటరు జాబితా ఎన్నికల పారదర్శకతకు, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ పై అవగాహన పెంపొందించు కోవాలని, భవిష్యత్తులో బాధ్యతాయుత మైన పౌరులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించి, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ రావు, డిఈఓ జిజిఎస్ నాగేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







డిసెంబర్ 1 నుంచి డ్రెస్ కోడ్ తప్పనిసరి అమలు.

సంప్రదాయ వస్త్రధారణ తోనే అప్పన్న దర్శనానికి రావాలి.

ఇప్పటికే ఆలయ పరిసరాల్లో అవగాహన బోర్డులు.


ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం.

నిబంధనల అమలులో ఎలాంటి మార్పు ఉండదు.

ఆలయ పవిత్రత, సనాతన సంప్రదాయాల పరి రక్షణే లక్ష్యం ఈఓ. జల్లేపల్లి వెంకటరావు.

సింహాచలం, పెన్ సత్తా, నవంబర్ 21:సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో డిసెంబర్ 1 వ తేదీ నుంచి భక్తులకు సంప్రదాయ వస్త్రధారణ (డ్రెస్ కోడ్) నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు స్పష్టం చేశారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులతో పాటు ఆర్జిత సేవల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ దేవస్థానం నిర్దేశించిన సంప్రదాయ దుస్తుల తోనే రావాలని తెలిపారు. డిసెంబర్ 1 నుంచి ఈ నిబంధనల అమలులో ఎలాంటి సందేహం లేదని, భక్తులు ముందుగానే సిద్ధమై సహకరించాలని కోరారు. డ్రెస్ కోడ్ అమలు పై భక్తులకు ముందస్తు అవగాహన కల్పించేందుకు దేవస్థానం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఆలయ పరిసరాల్లోని పలు ముఖ్య మైన ప్రాంతాల్లో వస్త్రధారణ నిబంధనలను వివరిస్తూ ప్రత్యేక అవగాహన బోర్డులను ఏర్పాటు చేసింది. అంతే కాకుండా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. భక్తులకు ఎలాంటి సందేహాలు తలెత్తకుండా పురుషులు, మహిళలు ధరించాల్సిన దుస్తులు, అనుమతించని వస్త్రధారణ వివరాలను స్పష్టంగా తెలియజేస్తోంది. పురుష భక్తులు ధోతీ--అంగవస్త్రం, కుర్తా--పైజామా లేదా సంప్రదాయబద్ధ మైన ఫార్మల్ షర్ట్, ప్యాంట్ ధరించి దర్శనానికి రావచ్చు. మహిళా భక్తులు చీర, లంగా ఓణీ లేదా దుపట్టాతో కూడిన చుడీదార్ ధరించాలి. షార్ట్స్, టీ-షర్టులు, స్లీవ్‌లెస్ టాప్స్, నిర్దేశిత సంప్రదాయ వస్త్రధారణకు భిన్నమైన దుస్తులకు అనుమతి ఉండదు. స్వామి నిత్య కల్యాణం తదితర ఆర్జిత సేవల్లో పాల్గొనే పురుష భక్తులు ధోతీ--అంగవస్త్రం లేదా సంప్రదాయ కుర్తా--పైజామా ధరించాలి. మహిళలు చీర, లంగా ఓణీ లేదా దుపట్టాతో కూడిన చుడీదార్‌తో మాత్రమే సేవల్లో పాల్గొనాల్సి ఉంటుంది. చిన్నపిల్లలు సైతం సంప్రదాయబద్ధ మైన దుస్తులు ధరించేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని దేవస్థానం సూచిస్తోంది.

సింహాచల క్షేత్ర పవిత్రత, ఆధ్యాత్మిక ఔన్నత్యం, సనాతన ధర్మ సంప్రదాయాలను పరి రక్షించాలనే ఉద్దేశంతోనే ఈ వస్త్రధారణ నియమావళిని తీసుకొచ్చినట్లు దీనికి భక్తులు సహకరించాలి అని ఈఓ కోరారు. ఇప్పటికే వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించిన నేపథ్యంలో డిసెంబర్ 1 వ తేదీ నుంచి ప్రతి భక్తుడూ తప్పనిసరిగా ఈ నిబంధనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ సిబ్బంది, భద్రతా విభాగానికి భక్తులు పూర్తిస్థాయిలో సహకరించాలని, సింహగిరి పవిత్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈఓ జల్లేపల్లి వెంకట రావు కోరారు.



రాష్ట్ర స్థాయి ఓపెన్ మెన్స్ డబల్ షటిల్ బ్యాట్మెంటన్ ఛాంపియన్ షిప్.





అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 21:వివేకానంద చారిటబుల్ ట్రస్ట్, జార్జి క్లబ్ (రి) సంయుక్త నిర్వహణలో రాష్ట్ర స్థాయి ఓపెన్ మెన్స్ డబల్ షటిల్ బ్యాట్మెంటన్ ఛాంపియన్ షిప్ జార్జి క్లబ్ లో డాక్టర్ సత్యవతి విష్ణుమూర్తి ట్రోఫీ శనివారం ఘనంగా ప్రారంభమయింది. ఈ ఛాంపియన్షిప్ పోటీలు రెండు రోజులపాటు నిర్వహించడం జరుగుతుంది. టోర్నమెంట్ లో 24 జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో జార్జిక్ క్లబ్ ప్రెసిడెంట్ దాడి బుజ్జి, సెక్రెటరీ కొణతాల మురళీ కృష్ణ, ట్రెజరర్ ఎస్ఎమ్ నాయుడు, డాక్టర్ కే విష్ణు మూర్తి చైర్మన్ వివేకానంద చారిబుల్ ట్రస్ట్, కొల్లి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కైట్స్ విద్యా విహార్ విద్యార్థులు



అచ్యుతాపురం, పెన్ సత్తా, నవంబరు 21 కైట్స్ విద్యా విహార్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఏడో తరగతి చదువుతున్న పి. భవిష్ అండర్-15 విభాగంలో రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు, పి. వెంకటేష్ అండర్-14 విభాగంలో ఎస్‌జీఎఫ్ఐ సెపక్ తక్రా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.. విద్యార్థుల విజయంపై పాఠశాల కరస్పాండెంట్ రెడ్డి గణేష్, ప్రిన్సిపాల్ ప్రసన్న, డైరెక్టర్ ప్రియాంక, పీడీ శివాజీ, ఉపాధ్యాయులు విద్యార్థుల్ని అభినందించారు. కైట్స్ విద్యా విహార్ పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఆకాంక్షించారు.

గ్రామ "ఐక్యతకు" నిదర్శనం.

- **37 ఏళ్ల తర్వాత కవిటి మేజర్ పంచాయితీ సర్పంచ్ ఏకగ్రీవం.**
- **సర్పంచ్ గా ప్రవల్లిక.**



కవిటి పెన్ సత్తా, నవంబరు 21కవిటి మండలంలో చరిత్ర పునరావృతమైంది. సుమారు 37 ఏళ్ల తర్వాత మేజర్ పంచాయతీ కవిటి సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామ ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి సర్పంచ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మొగిలిపురి ప్రవల్లిక (పాండవ రామారావు కుమార్తె) కవిటి సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పెద్దలు, అన్ని వర్గాల ప్రజలు, యువకులు, మహిళలు ఆమెకు సంపూర్ణ మద్దతు తెలిపి ఏకగ్రీవం చేశారు.37 ఏళ్ల తర్వాత మళ్లీ ఏకగ్రీవం జరగడం కవిటి గ్రామ ఐక్యతకు, గ్రామస్తుల పరిపక్వతకు నిదర్శనంగా నిలిచిందని గ్రామ పెద్దలు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల్లో పోటీ లేకుండా, గొడవలు లేకుండా గ్రామమంతా ఒక్కటై ప్రవల్లికను ఎన్నుకోవడం అభినందనీయమన్నారు.

ఏకగ్రీవం అనంతరం గ్రామంలో సంబరాలు మిన్నంటాయి. ప్రవల్లికకు గ్రామ ప్రజలు, పెద్దలు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కవితిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని నూతన సర్పంచ్ ప్రవల్లిక హామీ ఇచ్చారు.తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కింతాడ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా బరిలోకి కన్నూరు సూర్యనారాయణ.



కె.కోటపాడు, పెన్ సత్తా, నవంబరు 21:కూటమి పార్టీల మద్దతుతో మండలంలో కింతాడ పంచాయతీ సర్పంచ్ పదవికి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కన్నూరు సూర్యనారాయణ(కె.ఎస్.ఎన్) శనివారం కోలాహలంగా నామినేషన్ వేశారు. కింతాడ ఎంపీటీసీ సభ్యులు బత్తి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు కశిరెడ్డి అప్పలనాయుడు, నాయకులు బండారు అక్కన్నపాత్రుడు, బత్తి వెంకటరమణ, కింతాడ టీడీపీ ప్రధాన కార్యదర్శి జోగ దేముడు,ఎంపీటీసీ మాజీ సభ్యులు ఒమ్మి వెంకటరావు, వెంటరాగా కె.ఎస్.ఎన్. నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.అంతకు ముందు కింతాడ పంచాయతీ గ్రామాల ప్రజలు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, అనుచరులు వేలాదిగా కూంద్రపువానిపాలెం నుంచి కె.ఎస్.ఎన్.వెంట బైక్ లు, ఆటోలతో ర్యాలీగా అట్టహాసంగా వెళ్ళారు. కె.కోటపాడు సచివాలయంవద్ద నామినేషన్ కేంద్రం వరకూ కోలాటాలు, తప్పెట గుల్లు ప్రదర్శనలతో నామినేషన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.తన విజయానికి ఆకాంక్షిస్తూ అభిమానంతో మద్దతుగా, స్వచ్ఛందంగా నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు అని కె. ఎస్. ఎన్.తన స్వగృహంవద్ద మీడియా సమావేశంలో అన్నారు.ఈ కార్యక్రమాలో బీజేపీ నాయకులు బండారు రవితేజ పాత్రుడు,కూంద్రపు గంగు నాయుడు, జనసేన నాయకులు కడుపుట్ల గంగునాయుడు, బొట్ట పాలవెల్లి తదితరులు పాల్గొన్నారు.

గొన్న కళాశాలలో జాతీయ గ్రంథాలయ ముగింపు వారోత్సవాలు.

పరవాడ, పెన్ సత్తా, నవంబర్ 21:గొన్న కళాశాలలో జాతీయ గ్రంథాలయ ముగింపు వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుండి 20 వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు కళాశాలలో నిర్వహించారు. మంచి ప్రతిభ చూపించిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ గొన్న హేంచంద్ నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్. పి. ఎస్.న్.మూర్తి, బహుమతులు ప్రధానం చేశారు. ప్రిన్సిపాల్ గ్రంథాలయాల ఉపయోగాల గురించి వివరించారు. లైబ్రేరియన్స్ శ్రీరామ్ మూర్తి, శ్యామలరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ విజయ కృష్ణన్.

అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 21: తుమ్మపాల, కొత్తూరు పరిధి లోని పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల ఏర్పాట్ల పై శనివారం ఉదయం క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించి ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు, దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంప్ ల ఏర్పాటును తనిఖీ చేశారు. ? పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, క్యూ లైన్ల నిర్వహణ, పోలింగ్ సిబ్బందికి అవసర మైన వసతుల పై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

ఎన్నికల కోడ్, ఎన్నికల సంఘం నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఆర్డీవో శ్రీనివాస రావు, డిపిఓ కిరణ్ కుమార్ ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ ఆనంద్ రావు మొదలగువారు పాల్గొన్నారు.







జిల్లాను దేశం లోనే ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలి.



గోవా, కేరళ తరహాలో విశాఖపట్నం పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి.
జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్.

విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబరు 21: విశాఖపట్నం జిల్లాను దేశం లోనే ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ, వీఎంఆర్డీఏ అధికారులు సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సూచించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పర్యాటక శాఖ, వీఎంఆర్డీఏ అధికారులతో శనివారం మధ్యాహ్నం కలెక్టరు చాంబరులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో పర్యాటక అభివృద్ధికి చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికల పై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం విశాఖపట్నం జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్న పర్యాటకుల వివరాలను ప్రాంతాల వారీగా, పర్యాటకుల విభిన్న విభాగాల వారీగా విశ్లేషించాలని సూచించారు. పర్యాటకులు ఏయే ప్రాంతాల నుంచి వస్తున్నారు, వారి ఆసక్తులు, సందర్శన ప్రాధాన్యతలు తదితర అంశాల పై సమగ్ర అధ్యయనం చేసి, అందుకు అనుగుణంగా పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలన్నారు.

రానున్న విశాఖ ఉత్సవ్‌ను అత్యంత ఘనంగా, వైవిధ్యభరిత మైన కార్యక్రమాలతో నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో పర్యాటకులను ఆకర్షించేలా సాంస్కృతిక కార్యక్రమాలు, వినోద కార్యక్రమాలు, సాహస క్రీడలు, వివిధ ప్రత్యేక ఆకర్షణలను ఏర్పాటు చేయాలని సూచించారు. విశాఖపట్నం తీర ప్రాంతం లోని ప్రతి బీచ్‌కు ప్రత్యేక గుర్తింపు కల్పించే విధంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి బీచ్‌లో విభిన్నమైన పర్యాటక ఆకర్షణలు, వినోద కార్యక్రమాలు, అడ్వెంచర్యాక్టివిటీస్, పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా అన్ని బీచ్‌లను ప్రత్యేక పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. గోవా, కేరళ రాష్ట్రాల తరహాలో విశాఖపట్నం జిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు.

అలాగే, ఏపీటీడీసీతో పాటు ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్న పర్యాటక ప్యాకేజీలు, సాహస క్రీడలు, ఇతర పర్యాటక కార్యకలాపాల పూర్తి వివరాలను సేకరించి, పర్యాటకులకు సులభంగా అందుబాటులో ఉండేలా జీవీఎంసీ మరియు వీఎంఆర్డీఏ అధికారిక వెబ్‌సైట్లలో పొందుపరిచేందుకు అవసర మైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల పర్యాటకులు తమ పర్యటనలను ముందుగానే ప్రణాళిక చేసుకునేందుకు, అందుబాటులో ఉన్న పర్యాటక సేవలు మరియు కార్యకలాపాలపై సమగ్ర సమాచారం పొందేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లా పరిధికే పరిమితం కాకుండా, చుట్టుపక్కల ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రాలను కూడా గుర్తించి, వాటిని అనుసంధానం చేస్తూ సమగ్ర పర్యాటక సర్క్యూట్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో వీఎంఆర్డీఏ అదనపు కమిషనర్ కీర్తి, వీఎంఆర్డీఏఓఎస్డీ (ప్రాజెక్ట్స్) కృష్ణ నాయక్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ రిషి బాబు, ప్రాంతీయ సంచాలకులు మరియు కార్యనిర్వహణ అధికారి, ఏపీటీడీసీ, విశాఖపట్నం, జిల్లా పర్యాటక శాఖ అధికారి జె. మాధవి, డివిజనల్ మేనేజర్ జి.వి.బి. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో పెదబాబు ప్రచార జోరు.. ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ!





అభివృద్ధే లక్ష్యంగా ముందుకు.. గెలుపే ధ్యేయంగా ప్రచారంలో దూసుకుపోతున్న కూటమి అభ్యర్థి గునూరు పెదబాబు...

చోడవరం పెన్ సత్తా, నవంబరు 21:చోడవరం పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతోంది. కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన గునూరు పెదబాబు ప్రచారంలో తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. ఇంటింటి ప్రచారంతో పాటు ప్రజలను నేరుగా కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

ప్రజలతో మమేకమవుతూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, తనకు అవకాశం కల్పిస్తే గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పెదబాబు ప్రజలకు వివరిస్తున్నారు. గతంలో తాను నిర్వహించిన వివిధ ప్రజాప్రతినిధి బాధ్యతల ద్వారా ప్రజలకు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.గత ఐదేళ్లలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలను వివరిస్తూ ఓటర్ల మద్దతును కోరుతున్నారు. తాను ఎంపీపీగా, సర్పంచ్‌గా, తన భార్య గునూరు కొండమ్మ ఎంపీపీగా, సర్పంచ్‌గా, గునూరు మల్లునాయుడు సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో చోడవరం అభివృద్ధికి చేసిన కృషిని ప్రజలకు తెలియజేస్తున్నారు.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల కొనసాగింపే తన ప్రధాన లక్ష్యమని పెదబాబు పేర్కొంటున్నారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శిస్తూ, ఈసారి కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరుతున్నారు. మొత్తానికి చోడవరం పంచాయతీ ఎన్నికల వేళ గునూరు పెదబాబు ప్రచారం స్థానికంగా రాజకీయ చర్చకు దారితీస్తోంది. ప్రజల ఆదరణ, కార్యకర్తల ఉత్సాహం మధ్య ఆయన ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రానున్న ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాలి....

12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి!

ప్రపంచంలో భారత్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తోందని, ఆలోచనా విధానంలో వచ్చిన మార్పుతోనే దేశం అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గత 12 ఏళ్లలో దేశంలో సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం ఈ పురోగతి సాధ్యమైందని పేర్కొన్నారు. ఆలోచనల్లోని పరిమితులను అధిగమించినప్పుడే దేశం తన అసలైన సామర్థ్యాన్ని గుర్తించగలదని చెప్పారు. ఐఐటీ ఖరగ్‌పుర్ వజ్రోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని.. సంస్థ 75 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా ప్రత్యేక స్మారక నాణేన్ని ఆవిష్కరించారు. ఒకప్పుడు స్వాతంత్ర్య సమరయోధులను నిర్బంధించిన శిబిరంగా ఉన్న ఈ ప్రాంగణం నేడు ఆకాంక్షల నుంచి ఆత్మనిర్భరత వైపు భారత్ సాగిస్తున్న ప్రయాణానికి ప్రతీకగా నిలుస్తోందని కొనియాడారు.

పేదరికంపై ఆలోచనా విధానంలో మార్పు

ఒకప్పుడు పేదరికాన్ని శాశ్వత సమస్యగా భావించేవారని మోదీ వ్యాఖ్యానించారు. ఐదు దశాబ్దాల క్రితం నుంచే పేదరిక నిర్మూలన నినాదాలు వినిపించినప్పటికీ, వాటికి అనుగుణంగా విధానపరమైన చర్యలు తీసుకోవడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. దేశ జనాభా ఎక్కువగా ఉండటంతో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదనే భావన అప్పట్లో ఉండేదని అన్నారు. తమ ప్రభుత్వం ఆ ఆలోచనా ధోరణిని మార్చి పేదలకు సాధికారత కల్పించే దిశగా చర్యలు చేపట్టిందని వివరించారు.

మరుగుదొడ్ల నిర్మాణంపైనా విమర్శలు

తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. పేదల కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తానని



ప్రకటించినప్పుడు విమర్శలు ఎదురయ్యాయని తెలిపారు. ప్రధానమంత్రి మరుగుదొడ్ల గురించి మాట్లాడటమేంటని పార్లమెంటులో కొందరు ఎగతాళి చేశారని చెప్పారు. అయితే పేదలకు, ముఖ్యంగా మహిళలకు, తల్లులకు మరుగుదొడ్ల అవసరం ఎంత ఉందో విమర్శించినవారు గుర్తించలేకపోయారని పేర్కొన్నారు. అధికారాన్ని ప్రజల సాధికారతకు ఉపయోగించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

దేశమే ప్రథమం కావాలి

ఐఐటీ ఖరగ్‌పుర్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు దేశమే ప్రథమం అనే భావనతో ముందుకు సాగాలని ప్రధాని పిలుపునిచ్చారు. వారి ప్రతిభ, పరిశోధనలు దేశ అభివృద్ధికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. గత 75 ఏళ్లుగా ఐఐటీ ఖరగ్‌పుర్ దేశానికి విశేష సేవలు అందించిందని ప్రశంసించారు. సంస్థ పందో వార్షికోత్సవం అభివృద్ధి చెందిన భారత్‌లో జరిగేలా విద్యార్థులు, అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు.

యువతకు అంతరిక్ష రంగంలో అవకాశాలు

భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలు, స్టార్టప్‌లకు ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందని మోదీ తెలిపారు. గతంలో ప్రభుత్వ సంస్థలకే పరిమితమైన ఈ రంగాన్ని యువతకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఐఐటీ ఖరగ్‌పుర్ పూర్వ విద్యార్థి పవన్ కుమార్ చందన స్థాపించిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారత్ తొలి ప్రైవేటు రాకెట్ అభివృద్ధి, ప్రయోగంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. అనేక అంతరిక్ష స్టార్టప్‌లు దేశ అంతరిక్ష కార్యక్రమానికి కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయని అన్నారు.

సెమీకండక్టర్ రంగంలో ముందడుగు

సెమీకండక్టర్ తయారీలో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రధాని వివరించారు. సుమారు ఐదు దశాబ్దాల క్రితం ఒక సంస్థ సెమీకండక్టర్ల తయారీకి భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చినా, అప్పట్లో ఆ ప్రతిపాదనకు అవకాశం కల్పించలేదని గుర్తుచేశారు. దీంతో దేశం కీలక మైన అవకాశాన్ని కోల్పోయిందన్నారు. తాము సెమీకండక్టర్ మిషన్‌ను ప్రారంభించినప్పుడు ఆలస్యమైందంటూ విమర్శలు వచ్చినప్పటికీ వెనక్కి తగ్గలేదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో చిప్ తయారీ రంగం అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.

పరిమిత ఆలోచనలను అధిగమించాలి

వ్యక్తులు తమ కలలకు, ప్రతిభకు తామే హద్దులు విధించుకోవద్దని మోదీ సూచించారు. ఇలాంటి పరిమిత ఆలోచనలు వ్యక్తుల ఎదుగుదలతో పాటు దేశ పురోగతిని కూడా అడ్డుకుంటాయని అన్నారు. మన ఆలోచనల పరిధినే ప్రపంచపు పరిధిగా భావించకూడదని పేర్కొన్నారు. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే స్తబ్ధతను వీడి వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశం తన ఆలోచనా హద్దులను అధిగమించినప్పుడే పూర్తి సామర్థ్యాన్ని చాటుకోగలదని స్పష్టం చేశారు.

అయ్యప్ప భక్తులకు గుడ్ న్యూస్..

భక్తుల మనోభావాలను గౌరవిస్తూ నిర్ణయం తీసుకున్నామన్న మంత్రి రామ్మోహన్ నాయుడు

శబరిమల యాత్ర చేపట్టే అయ్యప్ప భక్తులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. విమానాల్లో ప్రయాణించే సమయంలో పవిత్రమైన 'ఇరుముడి'ని క్యాబిన్ బ్యాగేజీగా తమ వెంట తీసుకెళ్లేందుకు అనుమతి మంజూరు చేసింది. భక్తుల మనోభావాలు, సాంప్రదాయాలను గౌరవిస్తూ వరుసగా మూడో ఏడాది కూడా ఈ సడలింపును కొనసాగిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారికంగా వెల్లడించారు.

శతాబ్దాలుగా అయ్యప్ప స్వామి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఇరుముడిని వెంట తీసుకెళ్లడం ఆచారంగా వస్తోందని మంత్రి పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములు తమ పవిత్ర యాత్రను ఎటువంటి అసౌకర్యాలు లేకుండా సాఫీగా కొనసాగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (దీజీసీఏ), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (జఃూఖీ)తో పాటు విమానాశ్రయాల నిర్వాహకులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. పవిత్ర దీక్ష చేపట్టి యాత్రకు బయలుదేరే భక్తులందరికీ స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ నిర్ణయానికి సంబంధించి కేంద్ర పౌర విమానయాన శాఖ అధికారిక ఉత్తర్వులను కూడా జారీ చేసింది. విమానాల్లో భద్రతా కారణాల దృష్ట్యా సాధారణంగా నిషేధించే వస్తువుల జాబితా నుంచి ఇరుముడికి మినహాయింపునిస్తూ గతంలో



ఇచ్చిన ఆదేశాలు ఈ సీజన్‌లోనూ అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని విమానాశ్రయాల రీజినల్ కార్యాలయాలు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ూూఃఽ), ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లు నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. సాధారణంగా ఇరుముడిలో నెయ్యి నింపిన కొబ్బరికాయ, కర్పూరం వంటి పూజా ద్రవ్యాలు ఉంటాయి. విమానయాన భద్రతా నిబంధనల ప్రకారం ద్రవ పదార్థాలు, మండే స్వభావం గల వస్తువులను క్యాబిన్‌లోకి అనుమతించరు. అయితే శబరిమల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, భక్తుల భక్తి భావాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. విమానాల్లో ప్రయాణించే వేలాది మంది భక్తులకు ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది.

100 రోజులైనా ముగియని పార్లమెంట్ సమావేశాలు!


పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 100 రోజులు గడిచినా, ఇప్పటివరకు అధికారికంగా ప్రోరోగ్ కాకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశం 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకునే వరకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వాయిదా వేయాలని సూచించారు. అదే సమయంలో ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

డీలిమిటేషన్‌ను వాయిదా వేయాలి

సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా జైరాం రమేశ్ స్పందించారు. వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 100 రోజులు పూర్తయినా, అధికారికంగా ముగియకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు. డీలిమిటేషన్ బిల్లులోని ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం ఏ రాజకీయ పార్టీతోనూ సమగ్రంగా చర్చించలేదని ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీకి నాలుగు లేఖలు రాసినా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయలేదని విమర్శించారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక, సైనిక, విదేశాంగ సవాళ్లపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.

గతంలోనూ పునర్విభజన వాయిదా

నియోజకవర్గాల పునర్విభజనను గతంలోనూ వాయిదా వేసిన సందర్భాలున్నాయని జైరాం రమేశ్ గుర్తుచేశారు. 1976లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ డీలిమిటేషన్‌ను 25 ఏళ్లపాటు



వాయిదా వేశారని, 2001లో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి మరో 25 ఏళ్లపాటు వాయిదాను పొడిగించారని తెలిపారు. వారిద్దరూ వివేకవంతమైన నిర్ణయాలు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాలపై ప్రశాంత వాతావరణంలో చర్చలు జరగాలని, అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

మోదీ ప్రసంగంపై జైరాం రమేశ్ వ్యాఖ్యలు

నవంబర్ 19న ఫిక్కీ సమావేశంలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగంపైనా జైరాం రమేశ్ స్పందించారు. దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రధాని తీవ్ర ఆందోళనతో ఉన్నట్లు కనిపించారని వ్యాఖ్యానించారు. ఆర్థిక వ్యవస్థపై ఇంతటి ఆందోళన ఉన్నప్పుడు కీలకమైన డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చించేందుకు ప్రశాంతమైన వాతావరణం అవసరమని అభిప్రాయపడ్డారు.

ప్రోరోగ్ జాప్యంలో కొత్త రికార్డు

ఈ ఏడాది ఆగస్టు 13న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. అయితే ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడినప్పటికీ అధికారికంగా ప్రోరోగ్ చేయలేదు. గతంలోనూ ఇలాంటి సందర్భాలు ఉన్నప్పటికీ ప్రస్తుత జాప్యం కొత్త రికార్డుగా నిలిచింది. గతంలో 2008లో 87 రోజులు, 1987లో 76 రోజులు, 1989లో 54 రోజులు, 2006, 2013లో 49 రోజులు, 1963లో 41 రోజుల పాటు సమావేశాలు ప్రోరోగ్ కాలేదు. తాజా పరిణామంతో ఈ రికార్డులన్నీ అధిగమించబడ్డాయి. మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు అవసరమైన రాజ్యాంగ సవరణలు, డీలిమిటేషన్ అంశాల నేపథ్యంలో సమావేశాలను అధికారికంగా ముగించకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

కల్తీ మద్యం మరణాలు ప్రమాదం కాదు.. ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం!



మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ మరణాలు అనుకోకుండా జరిగిన ప్రమాదం కాదని, బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితమని ఆరోపించారు. విషపూరిత మద్యం కారణంగా పలువురు మరణించారన్న వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు.

ప్రభుత్వం ఇంకా నిద్రపోతోందా?

సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మణిపూర్‌లో గతంలో జరిగిన హింసాకాండ వందలాది కుటుంబాలను తీవ్రంగా దెబ్బతీసిందని, ఇప్పుడు కల్తీ మద్యం ఘటన మరిన్ని కుటుంబాల్లో విషాదాన్ని నింపిందని విమర్శించారు. అయినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం, పూర్తి సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు.

15 మంది మృతి.. 150 మందికిపైగా బాధితులు

చందేల్ జిల్లాలోని చక్పి కరోంగ్, పరిసర ప్రాంతాల్లో స్థానికంగా తయారు చేసిన మద్యం సేవించడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మద్యంలో మెథనాల్ అనే విషపూరిత రసాయనం కలవడం వల్లే మరణాలు సంభవించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో ఇప్పటివరకు కనీసం 15 మంది మరణించినట్లు సమాచారం. ఇంఫాల్‌లోని షిజా ఆస్పత్రిలో 150 మందికిపైగా బాధితులు చేరి చికిత్స పొందుతున్నారు. బబినా ఆస్పత్రిలోనూ పలువురికి వైద్య సేవలు అందిస్తున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది మధ్యవయస్కులు, యువకులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.


ఆస్పత్రుల్లో బాధితులను పరామర్శించిన సీఎం

మరోవైపు మణిపూర్ ముఖ్యమంత్రి యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ శుక్రవారం ఇంఫాల్‌లోని షిజా, బబినా ఆస్పత్రులను సందర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రత్యేక వైద్య బృందంతో పాటు అత్యవసర మందులను చందేల్ జిల్లాకు పంపించారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. బాధితులకు ఆర్థిక సాయం అందిస్తామని భరోసా కల్పించారు.

అక్రమ మద్యం తయారీపై విచారణ

కల్తీ మద్యం తయారీ వెనుక ఎవరున్నారు? విషపూరిత మెథనాల్ ఎక్కడ కలిసింది? అక్రమ మద్యం సరఫరా వ్యవస్థలో ఎవరెవరి పాత్ర ఉంది? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. మరోవైపు అనుమానాస్పద నాటుసారాను సేవించవద్దని, అక్రమ మద్యం తయారీ కేంద్రాల సమాచారం తెలిస్తే అధికారులకు తెలియజేయాలని చందేల్ జిల్లా యంత్రాంగం ప్రజలకు సూచించింది. బాధితులకు వైద్య సహాయం అందించడంతో పాటు ఈ ఘటనకు కారణమైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

కశ్మీర్ లోయలో ఉగ్రవాదులే లేరు!



కశ్మీర్ లోయలో ప్రస్తుతం క్రియాశీల కశ్మీరీ ఉగ్రవాదులు ఎవరూ మిగలలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఇటీవల పుల్వామాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాతో సంబంధం ఉన్న చివరి క్రియాశీల కశ్మీరీ ఉగ్రవాదిని భద్రతా దళాలు హతమార్చాయని వెల్లడించారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత కశ్మీర్‌లో పరిస్థితులు గణనీయంగా మారాయని పేర్కొన్నారు. శనివారం అరుణాచల్ ప్రదేశ్‌లోని బందర్‌దేవాలో ఉన్న పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా అరుణాచల్ ప్రదేశ్ పోలీసులకు ప్రతిష్టాత్మకమైన 'ప్రెసిడెంట్స్ పోలీస్ కలర్' పురస్కారాన్ని అందజేశారు.

ఉగ్రవాదానికి చరమగీతం: అమిత్ షా

1990లో కశ్మీర్‌లో ఉగ్రవాదం తీవ్రస్థాయికి చేరుకుందని అమిత్ షా గుర్తుచేశారు. అప్పట్లో కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగంగా కొనసాగించగలమా అనే ఆందోళనలు వ్యక్తమయ్యాయని చెప్పారు. ఆ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయారని, క్లిష్ట పరిస్థితుల్లో భద్రతా దళాలు చూపిన ధైర్యసాహసాలే కశ్మీర్‌ను దేశంతో ఐక్యంగా ఉంచాయని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భద్రతా బలగాల పాత్ర ఎనలేనిదని ప్రశంసించారు.

ఆర్టికల్ 370 రద్దుతో మార్పు

2019లో ఆర్టికల్ 370 రద్దు చేసినప్పుడు ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయని అమిత్ షా అన్నారు. ఆర్టికల్ 370కి, ఉగ్రవాదానికి సంబంధం ఏమిటని ప్రశ్నించాయని గుర్తు చేశారు. అయితే ఆ నిర్ణయం కశ్మీర్ యువతలో వేర్పాటువాద భావజాలాన్ని బలహీనపరిచిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కశ్మీర్ లోయలో ఒక్క క్రియాశీల కశ్మీరీ యువ ఉగ్రవాది కూడా లేడని ప్రకటించారు. ఈ పరిణామం దేశ ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు.

అరుణాచల్ పోలీసుల సేవలకు గుర్తింపు

అరుణాచల్ ప్రదేశ్ పోలీసులు అంతర్గత భద్రతా సవాళ్లు, తిరుగుబాటు, వ్యవస్థీకృత నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కొంటున్నారని అమిత్ షా ప్రశంసించారు. వారి సేవలను గుర్తిస్తూ ప్రతిష్టాత్మకమైన 'ప్రెసిడెంట్స్ పోలీస్ కలర్' పురస్కారాన్ని అందజేశారు. ఈ గౌరవం పోలీసు సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు, నాయకత్వానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ పురస్కారం మరింత బాధ్యతతో పనిచేసేందుకు పోలీసులకు స్ఫూర్తినిస్తుందని అన్నారు.

ఈశాన్యానికి అభివృద్ధి బాట

2014 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి కొత్త దశకు చేరుకుందని అమిత్ షా అన్నారు. ఈశాన్య ప్రాంతానికి కేంద్ర ప్రభుత్వం ఏమి చేసిందని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించినప్పుడల్లా తనకు చిరునవ్వు వస్తుందని వ్యాఖ్యానించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో అభివృద్ధికి కొత్త శకం ప్రారంభమైందని తెలిపారు. 'సూర్యుడు ఉదయించే భూమి'గా పేరొందిన అరుణాచల్ ప్రదేశ్‌లో శాంతి, భద్రత, అభివృద్ధి దేశానికి ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు శాశ్వత శాంతి నెలకొల్పేందుకు కేంద్రం కృషి చేస్తోందని వెల్లడించారు.

బిజినెస్

ఐఐటీ ఖరగ్‌పూర్‌కు గూగుల్ బంపర్ ఆఫర్

రూ.46 కోట్ల ఏఐ నిధుల బూస్ట్



భారత్‌లో ఏఐ పరిశోధన, ఆవిష్కరణలను కొత్త పుంతలు తొక్కించేందుకు అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ నిర్ణయం తీసుకుంది. ప్రఖ్యాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఖరగ్‌పూర్‌కు 5 మిలియన్ డాలర్ల (సుమారు రూ.46 కోట్ల) ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు ప్రకటించింది. దేశీయ సామాజిక సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలను కనుగొనడంతో పాటు భవిష్యత్ సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దడం ఈ భాగస్వామ్యం ప్రధాన ఉద్దేశం.

కీలక విభాగాల్లో నిధుల వినియోగం

ఆంగ్ల భాషా ఆధిపత్యాన్ని అధిగమించి భారతీయ భాషల్లో ఏఐ సాంకేతికతను విస్తరించడంపై పరిశోధకులు దృష్టి సారిస్తారు. దీనితో పాటు వ్యవసాయం, మెటీరియల్స్ సైన్స్, విద్యా సాంకేతికత (ఎడ్‌టెక్) రంగాల్లో క్షేత్రస్థాయి సవాళ్లను పరిష్కరించే ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తారు. ఏఐ నైపుణ్యాలను కేవలం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకే పరిమితం చేయకుండా అన్ని విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులకు చేరువ చేయనున్నారు. ఇందుకోసం ఆధునిక పాఠ్యప్రణాళికల రూపకల్పనకు గూగుల్ తోడ్పాటు అందిస్తుంది.

క్యాంపస్‌లో నూతన ఏఐ ఫ్రేమ్‌వర్క్‌లు, పరిశోధనా సాధనాలను అభివృద్ధి చేసి వినూత్న సమూనాల రూపకల్పనకు అవసరమైన సాంకేతిక వాతావరణాన్ని బలోపేతం చేస్తారు.

సుందర్ పిచాయ్ ఏమన్నారంటే..

తన విద్యా ప్రయాణంలో కీలక పాత్ర పోషించిన ఐఐటీ ఖరగ్‌పూర్ తదుపరి తరం విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడటం ఎంతో సంతోషంగా ఉందని గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. భారతీయ భాషలు, వ్యవసాయం, విద్య వంటి రంగాల్లో ఈ సంస్థ చేస్తున్న పరిశోధనల ఫలాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ చేరాలన్న లక్ష్యానికి ఈ నిధులు ఊతమిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశోధన, శిక్షణ, మౌలిక వసతులను ఒకే వేదికపైకి తీసుకురావడం విద్యాసంస్థలు--పరిశ్రమల భాగస్వామ్యంలో కీలక మైలురాయి కానుంది. అయితే, వివిధ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, అమలు కాలపరిమితిపై స్పష్టత రావాల్సి ఉంది.

స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు రూ.2 కోట్ల భారీ జరిమానా



హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌ల పరిష్కారంలో నిబంధనలు ఉల్లంఘించినందుకు ప్రముఖ బీమా సంస్థ స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్‌కు భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) రూ.2 కోట్ల భారీ జరిమానా విధించింది. కోవిడ్-19 సహా పలు ఆరోగ్య బీమా క్లెయిమ్‌లను సరైన కారణాలు లేకుండా తిరస్కరించడం, పాలసీ నిబంధనలకు విరుద్ధంగా క్లెయిమ్ మొత్తాల్లో కోతలు విధించడం వంటి అంశాలను నియంత్రణ సంస్థ తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 2022 జనవరి 31 నుంచి ఫిబ్రవరి 11 వరకు స్టార్ హెల్త్ కార్యకలాపాలపై నిర్వహించిన తనిఖీల్లో ఈ ఉల్లంఘనలు వెలుగుచూశాయి. ముఖ్యంగా కోవిడ్ బాధితులకు ఆసుపత్రిలో చికిత్స అవసరం లేదనే కారణంతో కొన్ని క్లెయిమ్‌లను తిరస్కరించినట్లు ఐఆర్‌డీఏఐ గుర్తించింది. వైద్యుల సూచనలు, పాలసీ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించలేదని అభ్యంతరం వ్యక్తం చేసింది. కొన్ని సందర్భాల్లో నియంత్రణ సంస్థ తప్పులను ఎత్తిచూపిన తర్వాతే బీమా మొత్తాలను చెల్లించినట్లు పేర్కొంది. మరోవైపు, క్లెయిమ్‌లను తిరస్కరించినప్పుడు లేదా చెల్లింపు మొత్తాన్ని తగ్గించినప్పుడు అందుకు సంబంధించిన నిర్దిష్ట పాలసీ నిబంధనలను వినియోగదారులకు వివరించలేదని ఐఆర్‌డీఏఐ గుర్తించింది. దీంతో తమ క్లెయిమ్‌లు ఎందుకు తిరస్కరణకు గురయ్యాయో తెలుసుకోవడంతో పాటు, ఆ నిర్ణయాలను సవాలు చేసే అవకాశం పాలసీదారులకు లేకుండా పోయిందని అభిప్రాయపడింది. ఈ ఉల్లంఘనలకు సంబంధించి రూ.1 కోటి జరిమానా కోవిడ్ క్లెయిమ్‌ల తిరస్కరణకు, మరో రూ.1 కోటి పాలసీ నిబంధనలకు విరుద్ధమైన కోతలు, క్లెయిమ్ నిర్ణయాలపై సరైన సమాచారం ఇవ్వకపోవడానికి విధించింది. ఈ జరిమానాను 45 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించింది. అంతేకాకుండా, నెట్‌వర్క్ ఆసుపత్రులతో కుదుర్చుకున్న రాయితీలు ఆసుపత్రి బిల్లుల్లో చూపించకపోవడంపై హెచ్చరించింది. ఇకపై క్లెయిమ్ సెటిల్‌మెంట్ లేఖల్లో ఆమోదించిన మొత్తం, తిరస్కరించిన మొత్తం, చెల్లింపునకు అర్హత లేని ఖర్చులు, రాయితీలు, బీమా మొత్తంలో తగ్గింపులను విడివిడిగా పేర్కొనాలని స్పష్టం చేసింది. ఉత్తర్వులను కంపెనీ బోర్డు ముందు ఉంచి, 90 రోజుల్లోగా చర్యల నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ జరిమానాపై అందుబాటులో ఉన్న తదుపరి చర్యలను పరిశీలిస్తున్నట్లు స్టార్ హెల్త్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది.

ఎఫ్‌బీఐ క్రైమ్ డేటాబేస్‌పై సైబర్ దాడి కలకలం

అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) సైబర్ భద్రతా వ్యవస్థలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా నేర పరిశోధనలు, అరెస్టు వారెంట్లు, నిందితుల గుర్తింపు వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని భద్రపరిచే ఎఫ్‌బీఐ కీలక విభాగం 'నేషనల్ క్రైమ్ ఇన్ఫర్మేషన్ సెంటర్' (ఎన్‌సీఐసీ)లోకి హ్యాకర్లు చొరబడినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఏడాది సెప్టెంబరులో ఉద్యోగ నియామకాల పోర్టల్‌పై జరిగిన దాడి తర్వాత, తాజాగా కీలక డేటాబేస్ లక్ష్యంగా మారడం అమెరికా ప్రభుత్వ డిజిటల్ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

పోలీసు వ్యవస్థకు కీలకంగా ఎన్‌సీఐసీ

1967లో ఏర్పాటైన ఎన్‌సీఐసీని ఎఫ్‌బీఐలోని క్రిమినల్ జస్టిస్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (సీజేఐఎస్) విభాగం నిర్వహిస్తోంది. అమెరికాలోని 50 రాష్ట్రాలు, సమాఖ్య, స్థానిక, చట్ట అమలు సంస్థలతో పాటు అనుమతి పొందిన కొన్ని విదేశీ ఏజెన్సీలు దీన్ని వినియోగిస్తాయి. పెండింగ్ అరెస్టు వారెంట్లు, పరారీలో ఉన్న నేరస్థులు, అదృశ్యమైన వ్యక్తులు, దొంగిలించిన వాహనాలు, ఆయుధాల రికార్డులతో పాటు ఉగ్రవాద ముప్పుల గుర్తింపునకు ఇది కీలక ఆధారం. ఈ డేటాబేస్‌లోకి అనధికారికంగా ప్రవేశిస్తే నేర పరిశోధనల గోప్యత, క్షేత్రస్థాయి పోలీసు కార్యకలాపాల భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

సెప్టెంబరు ఘటన.. తాజా దర్యాప్తు

గత సెప్టెంబరు 23న ఎఫ్‌బీఐకి చెందిన టఎఱయశీఎం.స్రశీఱ పోర్టల్‌పై సైబర్ దాడి జరిగినట్లు సంస్థ అధికారికంగా ధ్రువీకరించింది. అందులో దరఖాస్తుదారుల వ్యక్తిగత సమాచారానికి ముప్పు ఏర్పడినట్లు అప్పట్లో ప్రకటించింది. అయితే, సెప్టెంబరు ఘటనకు, తాజా ఎన్‌సీఐసీ దాడికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ఇప్పటివరకు ఎలాంటి నిర్ధారణ లేదు. సీఎన్ఎన్, రాయిటర్స్ వంటి అంతర్జాతీయ వార్తా సంస్థల నివేదికల ప్రకారం



ఎఫ్‌బీఐ ఈ వ్యవహారంపై అంతర్గత దర్యాప్తు ముమ్మరం చేసింది. అయితే, ఈ ఘటనపై ఎఫ్‌బీఐ నుంచి ఇంకా అధికారిక బహిరంగ ప్రకటన వెలువడలేదు. హ్యాకర్లు వ్యవస్థలోకి ఏ మేరకు చొరబడ్డారు? డేటాను తస్కరించారా? పోలీసు సేవలకు అంతరాయం కలిగిందా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

టీమిండియా బ్యాటర్ల అరుదైన ఫీట్..

94 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి!

న్యూజిలాండ్‌తో టెస్టులో భారత బ్యాటర్ల అరుదైన రికార్డు

విదేశీ గడ్డపై తొలిసారి టాప్-5 బ్యాటర్లందరి నుంచీ 50కి పైగా రన్స్

సెంచరీతో మెరిసిన కేఎల్ రాహుల్, 98 పరుగుల వద్ద ఔటైన కెప్టెన్ గిల్

రాహుల్, జైస్వాల్, పడిక్కల్, గిల్, పంత్ అందరూ హాఫ్ సెంచరీ మార్క్ దాటిన వైనం

న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా వెల్లింగ్‌టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో టీమిండియా బ్యాటర్లు పరుగుల వరద పారించారు. తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్ లో భారత టాప్-5 బ్యాటర్లు అందరూ 50 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసి చరిత్ర సృష్టించారు. భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇలా జరగడం ఇది ఐదోసారి కాగా, విదేశీ గడ్డపై ఇలాంటి ఘనత సాధించడం మాత్రం ఇదే తొలిసారి కావడం విశేషం. 94 ఏళ్ల భారత టెస్ట్ చరిత్రలో ఏ పర్యటనలోనూ ఈ ఫీట్ నమోదు కాలేదు. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్‌ను 368 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్, మూడో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 486 పరుగుల భారీ స్కోరుతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఈ ఇన్నింగ్స్‌లో భారత బ్యాటింగ్ లైనప్ అద్భుతంగా రాణించింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (85), కేఎల్ రాహుల్ (136) తొలి వికెట్‌కు 130 పరుగుల



భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత వచ్చిన దేవదత్ పడిక్కల్ (80) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (98) తృటిలో సెంచరీ చేజార్చుకుని నిరాశగా వెనుదిరిగాడు. చివర్లో రిషభ్ పంత్ కూడా దూకుడుగా ఆడి 62 బంతుల్లో 55 పరుగులతో అజేయంగా నిలిచాడు.

కేఎల్ రాహుల్ రికార్డుల మోత

ఈ మ్యాచ్‌లో అద్భుత శతకంతో మెరిసిన కేఎల్ రాహుల్ పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. న్యూజిలాండ్ గడ్డపై తన తొలి టెస్ట్ ఇన్నింగ్స్‌లోనే సెంచరీ సాధించిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు. గతంలో 1976లో సునీల్ గవాస్కర్ (116), సురీందర్ అమర్‌నాథ్ (124) ఈ ఘనత సాధించారు. అంతేకాకుండా, అన్ని సేనా (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లోనూ టెస్ట్ సెంచరీ చేసిన ఐదో భారత క్రికెటర్‌గా రాహుల్ నిలిచాడు. తన ఇన్నింగ్స్‌లో రాహుల్.. జైస్వాల్‌తో కలిసి 130 పరుగులు, పడిక్కల్‌తో కలిసి 165 పరుగుల కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఈ ప్రదర్శనతో టీమిండియా ప్రస్తుతం 118 పరుగుల ఆధిక్యంతో మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది.

స్పోర్ట్స్

డబ్ల్యూటీసీలో సరికొత్త చరిత్ర:

3000 పరుగులతో గిల్ సరికొత్త రికార్డు..

వెంటే పంత్!

డబ్ల్యూటీసీలో 3,000 పరుగులు సాధించిన తొలి భారతీయుడిగా గిల్

98 పరుగుల వద్ద ఔటై సెంచరీ చేజార్చుకున్న భారత కెప్టెన్

3,000 పరుగుల మార్కును దాటిన రెండో భారత బ్యాటర్‌గా రిషబ్ పంత్

ఈ ఘనత సాధించిన ప్రపంచంలోనే తొలి వికెట్ కీపర్‌గా పంత్ రికార్డు

136 పరుగులతో సేనా దేశాల్లో సెంచరీలు పూర్తి చేసిన తొలి ఓపెనర్‌గా రాహుల్




భారత టెస్ట్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) చరిత్రలో 3,000 పరుగుల మైలురాయిని అందుకున్న మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ మూడో రోజు ఆటలో గిల్ ఈ ఘనత సాధించాడు. దూకుడుగా ఆడి 98 పరుగులు చేసిన అతడు.. గ్లెన్ ఫిలిప్స్ బౌలింగ్‌లో భారీ సిక్సర్‌తో ఈ రికార్డును చేరుకున్నాడు. అయితే కేవలం రెండు పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్నాడు. గిల్ రికార్డు సాధించిన కాసేపటికే స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ కూడా ఇదే మైలురాయిని అధిగమించాడు. డబ్ల్యూటీసీలో 3,000 పరుగులు పూర్తి చేసిన రెండో భారత బ్యాటర్‌గా పంత్ నిలిచాడు. అంతేకాకుండా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో ఈ ఘనత సాధించిన ప్రపంచంలోనే తొలి వికెట్ కీపర్‌గా సరికొత్త చరిత్ర లిఖించాడు. 123వ ఓవర్‌లో బౌండరీ బాది తన 22వ టెస్ట్ హాఫ్ సెంచరీతో పాటు ఈ రికార్డును అందుకున్నాడు. వీరిద్దరి ఘనతపై బీసీసీఐ 'ఎక్స్' వేదికగా ప్రత్యేకంగా అభినందనలు తెలిపింది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో న్యూజిలాండ్ బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించారు. ఓపెనర్ కేఎల్ రాహుల్ 136 పరుగులతో భారీ సెంచరీ బాదాడు. తద్వారా సేనా (దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలన్నింటిలోనూ టెస్ట్ సెంచరీలు సాధించిన తొలి భారత ఓపెనర్‌గా చరిత్రకెక్కాడు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ 85, దేవదత్ పడిక్కల్ 80 పరుగులు చేశారు. విదేశీ గడ్డపై జరిగిన ఒక టెస్ట్ ఇన్నింగ్స్‌లో భారత్‌కు చెందిన టాప్-5 బ్యాటర్లందరూ 50కి పైగా పరుగులు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 4 వికెట్లకు 486 పరుగులు చేసి, 118 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఊహించని నిర్ణయం: ధోనీ రిటైర్మెంట్‌పై జహీర్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఐపీఎల్‌లో ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించిన ఎంఎస్ ధోనీ

రాబోయే 2027 సీజన్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ మెంటార్‌గా కొత్త ప్రయాణం

ధోనీ వీడ్కోలు నిర్ణయం తనను ఆశ్చర్యపరిచిందన్న హెడ్ కోచ్ జహీర్ ఖాన్



టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్‌లో ఆటగాడిగా తన ప్రయాణానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుతో సుదీర్ఘ అనుబంధం ఉన్న ధోనీ, ప్లేయర్‌గా రిటైర్మెంట్ తీసుకుని 2027 సీజన్ నుంచి జట్టు మెంటార్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ అనూహ్య నిర్ణయంపై సీఎస్‌కే హెడ్ కోచ్ జహీర్ ఖాన్ స్పందిస్తూ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ధోనీ రిటైర్మెంట్ నిర్ణయం వ్యక్తిగతంగా తనను ఆశ్చర్యానికి గురిచేసిందని జహీర్ ఖాన్ పేర్కొన్నాడు. అయితే ఏ సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలో ధోనీకి బాగా తెలుసని చెప్పాడు. పిక్క కండరాల గాయం కారణంగా ధోనీ 2026 ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యాడు. అతడు చివరిసారిగా 2025 సీజన్‌లో మైదానంలో కనిపించాడు. నవంబర్ 17న ప్లేయర్ రిటెన్షన్ జాబితా విడుదలైన సమయంలో ధోనీని మెంటార్‌గా నియమిస్తున్నట్లు సీఎస్‌కే యాజమాన్యం ప్రకటించింది. 2008 నుంచి 19 సీజన్ల పాటు ఐపీఎల్‌లో కొనసాగిన ధోనీ, మొత్తం 278 మ్యాచ్‌లలో 5,439 పరుగులు సాధించాడు. కెప్టెన్‌గా సీఎస్‌కే జట్టుకు 5 ఐపీఎల్ టైటిళ్లు, 2 ఛాంపియన్స్ లీగ్ ట్రోఫీలను అందించాడు. ఆటగాడిగా బరిలోకి దిగకపోయినా, రాబోయే సీజన్లలో మెంటార్‌గా అతడు ఇచ్చే సూచనలు జట్టుకు కొండంత బలాన్నిస్తాయని యాజమాన్యం భావిస్తోంది.

సంపాదకీయం


ఖనిజ భద్రత!?

ఒక లిథియం గని వేలానికి ఒక్క రోజు చాలు. కానీ నేల కిందనున్న ఖనిజాన్ని బ్యాటరీ తయారీదారులు వాడగలిగే సరుకుగా మార్చాలంటే ఏళ్లు పడుతుంది. వనరుకూ, వాడకానికి సిద్ధంగా ఉన్న సరఫరాకూ మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చడమే భారత కీలక ఖనిజాల విధానానికి అసలు పరీక్ష! ఈ రంగానికి ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యం సమర్థనీయమే. ఏడేళ్ల కాలానికి రూ.34,300 కోట్లతో జాతీయ కీలక ఖనిజాల మిషన్ మొదలైంది. అన్వేషణ, తవ్వకం, శుద్ధి అన్నీ దీని పరిధిలోనే. లిథియం, కోబాల్ట్, నికెల్, రేర్ ఎర్త్‌లవంటి ఖనిజాలు విద్యుత్ వాహనాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, రక్షణ రంగాలకు ప్రాణాధారం. వాటి సరఫరా భద్రంగా లేకపోతే మన తయారీ ఆశయాలు నిలవవు. కాబట్టి ప్రభుత్వ ఉద్దేశం సరైనదే. అయితే గనులు ఉంటే చాలా, సరఫరా వస్తుందా? అన్నదే అసలు ప్రశ్న. వేలం పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది జూన్‌నాటికి ఇప్పటివరకు ఇచ్చిన 88 బ్లాకుల్లో 56 వేలంలో పోయాయి. నవంబరులో తొమ్మిదో విడతలో 20 బ్లాకులను ప్రభుత్వం ప్రకటించింది. అర్హత పొందిన బిడ్డర్ల కనీస సంఖ్యను మూడునుంచి రెండుకు తగ్గించింది. ఎందుకంటే కొన్ని వేలాలు బిడ్లు లేక రద్దయ్యాయి. జమ్మూకశ్మీర్‌లోని రియాసి లిథియం బ్లాకు అలాంటిదే. అంటే వేలం వేసినంత మాత్రాన గని తెరుచుకోదు, సరఫరా మొదలుకాదు. తవ్విన ఖనిజాన్ని మలినాలు తొలగించి, శుద్ధి చేస్తేనే పరిశ్రమకు పనికొస్తుంది. భారత్ ఇప్పటికీ శుద్ధి చేసిన కీలక ఖనిజాల్లో అధిక భాగాన్ని దిగుమతి చేసుకుంటోంది. చైనా బలం తవ్వకాల్లో కంటే శుద్ధి సామర్థ్యంలోనే ఉంది. ప్రపంచ శుద్ధి సామర్థ్యంలో సుమారు 90 శాతం ఆ దేశానిదే. మన రేర్ ఎర్త్ అయస్కాంతాల్లో సుమారు 85 శాతం అక్కడి నుంచే వస్తున్నాయన్నది పరిశ్రమల నివేదిక. ఈ ఆధారపడటం ఎంత ప్రమాదమో 2025 ఏప్రిల్‌లో చైనా ఎగుమతి అంక్షలు పెట్టినప్పుడు చూశాం. భారత విద్యుత్ వాహన తయారీదారులకు సరఫరా అలస్యమైంది. ఇప్పుడు ఆ అంక్షల్లో కొన్నింటిపై విరామాన్ని 2027 జనవరి 10 వరకు పొడిగించారు. కానీ ఏడు భారీ రేర్ ఎర్త్ మూలకాలపై ఏప్రిల్ 2025 నాటి లైసెన్సు నిబంధనలు ఇంకా అమల్లోనే ఉన్నాయి. విరామం తాత్కాలికమే. ఏ క్షణమైనా పరిస్థితి మారవచ్చు, అప్పుడు మన కర్మాగారాలు ఆగిపోతే నష్టం కోట్లలో ఉంటుంది. కాబట్టి తవ్వకం, శుద్ధి రెండూ కలిసి సాగాలి. శుద్ధి పరిశ్రమ లేకుంటే ఎన్ని గనులు తెరిచినా ముడి ఖనిజం విదేశాలకు వెళ్లి, శుద్ధి సరుకు తిరిగి అధిక ధరకు రావడం తప్పదు. అందుకే గుజరాత్, మహారాష్ట్ర, ఏపీ, ఒడిశాల్లో నాలుగు శుద్ధి పార్కులు, రూ.7,350 కోట్ల రేర్ ఎర్త్ శాశ్వత అయస్కాంతాల పథకం వంటి చర్యలు వేలం తేదీలకంటే కీలకమైనవి.

తవ్వకాల కంటే వేగంగా ఫలితమిచ్చే మార్గం పునర్వినియోగం. పాత ఫోన్లు, కంప్యూటర్లు, బ్యాటరీల్లో లిథియం, కోబాల్ట్, నికెల్, రేర్ ఎర్త్‌లు ఉంటాయి. మిషన్‌లో భాగంగా రూ.1,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి కేంద్ర మంత్రివర్గం 2025 సెప్టెంబరులో ఆమోదమిచ్చింది. దీనివల్ల ఏటా సుమారు 270 వేల టన్నుల పునర్వినియోగ సామర్థ్యం, 40 వేల టన్నుల ఖనిజ ఉత్పత్తి, రూ.8,000 కోట్ల పెట్టుబడి, 70 వేల ఉద్యోగాలు వస్తాయని అంచనా. 2031నాటికి 400 వేల టన్నుల ఖనిజాలను వ్యర్థాల నుంచి తిరిగి పొందాలన్నది లక్ష్యం. పునర్వినియోగం వల్ల పర్యావరణ నష్టమూ తగ్గుతుంది. కానీ ఇక్కడ పరిమాణం కంటే ప్రారంభమే ముఖ్యం. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఏటా పెరుగుతున్నాయి. వాటి లెక్కలు వేర్వేరు సంస్థల అంచనాల్లో తేడాగా ఉన్నాయి. అయినా ఒక విషయం స్పష్టం. అధికారిక పునర్వినియోగం కేవలం 10 శాతం లోపేనని. ఎక్కువ విడగొట్టే పని అసంఘటిత రంగంలోనే జరుగుతోంది. బ్యాటరీల్లోని విలువైన నల్లపొడి దేశంలో తీయకుండానే ఎగుమతి అవుతోంది, ఎందుకంటే మన శుద్ధి సామర్థ్యం చాలదు. అసలు సవాలు సేకరణ, జాడ తెలుసుకునే వ్యవస్థ. చిన్న చిన్న చెత్త వ్యాపారులపై ఆధారపడిన మన వ్యవస్థ చెల్లాచెదురుగా ఉంది. పునర్వినియోగదారులకు వ్యర్థాలు క్రమం తప్పకుండా అందాలి. తయారీదారులకు ఆ పదార్థం నాణ్యతపై నమ్మకముండాలి. సంఖ్యలు ఏవైనా, విలువైన లోహాలు చెత్తలో కలిసిపోతున్నాయనేది వాస్తవం. ఈ పథకం ద్వారా చిన్న సంస్థలకు, కొత్త సంస్థలకు కూడా అవకాశం దక్కేలా చూడాలి. అసంఘటిత కార్మికులను కూడా ఈ వ్యవస్థలోకి తీసుకువస్తేనే ఇది సాధ్యం. ఇందులో సాంకేతిక నైపుణ్యమూ కావాలి. శుద్ధి, వెలికితీత పద్ధతుల్లో శిక్షణ పొందిన మానవ వనరులను విద్యా సంస్థలు, పరిశ్రమలు కలిసి తయారు చేయాలి. అప్పుడే పథకం కాగితాల నుంచి కర్మాగారాల్లోకి చేరుతుంది.

నిల్వల ప్రతిపాదన ఇందులో మరో ముఖ్య భాగం. ఎగుమతి అంక్షలతో సరఫరా ఎంత హఠాత్తుగా మారుతుందో చూశాం. కాబట్టి జాతీయ నిల్వ అవసరమే. దీని కోసం మిషన్‌లో రూ.500 కోట్లు కేటాయించారు, విధానాన్ని త్వరలో ఖరారు చేస్తామని గనుల కార్యదర్శి అక్టోబరులో చెప్పారు. అయితే కేవలం నిల్వ చేయడం వ్యూహం కాదు. ఏ ఖనిజాలను, ఎంత మోతాదులో నిల్వ చేయాలి, ఎవరికి ఎప్పుడు విడుదల చేయాలి అనేవి ముందే నిర్ణయించాలి. సాంకేతికత మారితే వ్యూహాత్మకంగా కీలకమయ్యే ఖనిజాలూ మారతాయి. అందుకే ఈ విధానం సరళంగా ఉండాలి. ఉదాహరణకు ఒక ఖనిజ ధర పడిపోయినప్పుడు కొనుగోలు చేయడం, కొరత వచ్చినప్పుడు పరిశ్రమకు విడుదల చేయడం వంటి స్పష్టమైన నియమాలు కావాలి. లేకపోతే నిల్వ ఖర్చు పెరిగి, ప్రయోజనం తగ్గుతుంది. అలాగే విదేశాల్లో ఖనిజ గనులను సొంతం చేసుకోవడం, మిత్ర దేశాలతో ఒప్పందాలు కూడా దేశీయ ప్రయత్నాలకు తోడుగా ఉండాలి. అప్పుడే ఒకే దేశంపై ఆధారపడే ముప్పు తగ్గుతుంది. కొద్ది కాలంలో భారత్ చాలా దూరం వచ్చింది. కొన్నేళ్ల క్రితం కీలక ఖనిజాలపై విధాన దృష్టే లేదు. ఇప్పుడు విధానం, నిధులు, సంస్థాగత చట్రం ఉన్నాయి. అసలు కష్టం ఇక అమలులో ఉంది. అనుమతులు వేగంగా ఇవ్వడం, పెట్టుబడిదారులకు స్థిరమైన నిబంధనలు చూపడం, రాష్ట్రాలతో సమన్వయం అందుకు అవసరం. వేలం నిర్వహించడం, అన్వేషణ లక్ష్యాలు చేరడం ఒక ఎత్తు. ఖనిజాన్ని శుద్ధి చేసి, పునర్వినియోగం ద్వారా పరిశ్రమకు నిరంతర సరఫరా ఇవ్వడం మరో ఎత్తు. రాబోయే దశాబ్దంలో మన ఖనిజ వ్యూహం ఎంత విజయవంతమవుతుందో నిర్ణయించేది అమ్మిన బ్లాకుల సంఖ్య కాదు, ఈ సవాళ్లకు మనం ఇచ్చే సమాధానమే. ఈ ప్రయాణంలో ఓపిక, స్థిరత్వం రెండూ కావాలి. గనుల వేలం నుంచి పదార్థ భద్రత వైపు ఎదగడమే భారత్ ముందున్న అసలు మెట్టు!

పనికొచ్చే పలుకు



తగ్గితే.. తప్పేంటి బాసూ!

మనిషి జీవితంలో సమస్యలు సహజం. ఇద్దరు వ్యక్తులు కలిసి జీవిస్తున్నప్పుడు అభిప్రాయభేదాలు, చిన్న చిన్న గొడవలు, అపార్థాలు మామూలే. ఎందుకంటే -ఇద్దరి ఆలోచనలు ఒకేలా ఉండవు. ఒకే విషయాన్ని ఇద్దరూ ఒకే కోణంలో చూడలేరు. ఒకరికి సరైనదిగా అనిపించింది మరొకరికి తప్పుగా అనిపించవచ్చు. అయితే ఇక్కడే ఒక విషయం గుర్తుంచుకోవాలి. సమస్య రావడం వల్ల బంధం బలహీనపడదు. సమస్యను ఎలా ఎదుర్కొంటున్నామన్న దానిపైనే బంధం బలపడుతుందా? బలహీనపడుతుందా? ఆధారపడి ఉంటుంది.

చాలామంది.. సమస్య ఎదురైనా వెంటనే ఎదుటివారిని నిందిస్తారు. 'నీ వల్లే ఇదంతా జరిగింది', 'నువ్వు ఎప్పుడూ ఇంతే', 'నీకు అసలు బాధ్యత లేదు' అంటూ మాటలతో గాయపరుస్తారు. ఆ క్షణంలో తమ వాదనను గెలిపించుకోవచ్చు. ఎదుటివారిని మౌనంగా ఉండేలా చేయవచ్చు. కానీ ఆ మాటలు అవతలి వ్యక్తి మనసులో ఎంతటి బాధను మిగులుస్తాయో ఆలోచించరు. ఒక సమస్యను పరిష్కరించుకోవాల్సిన సమయంలో కొత్త సమస్యలకు పునాది వేస్తారు. చివరకు అసలు సమస్యకంటే, ఆ సమస్య సందర్భంగా మాట్లాడుకున్న మాటలే ఎక్కువ బాధను కలిగిస్తాయి. నిజానికి బలమైన బంధానికి అసలైన పరీక్ష సంతోషకరమైన సమయాల్లో కాదు.. కష్టాలు ఎదురైనప్పుడే జరుగుతుంది. సమస్య వచ్చినప్పుడు పరస్పరం నిందలు వేసుకోకుండా, ఇద్దరూ కలిసి దాన్ని ఎలా పరిష్కరించుకోవాలనే ఆలోచన చేయగలిగితే ఆ బంధానికి తిరుగుండదు.


ఇందుకోసం మనిషి జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలి. మొదటిది.. కోపంలో మాట్లాడకుండా ఉండటం. కోపం వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా సమయం తీసుకోవాలి. రెండోది.. ఎదుటివారు చెప్పేది పూర్తిగా వినడం. మన అభిప్రాయం చెప్పే తొందరలో వారి బాధను, ఆలోచనను అర్థం చేసుకోవడం మర్చిపోకూడదు. మూడోది.. ప్రతి సందర్భంలోనూ మనమే సరైనవాళ్లమని నిరూపించుకోవాలనే ఆలోచనను వదులుకోవాలి. తప్పు జరిగితే అంగీకరించడం బలహీనత కాదు. క్షమాపణ చెప్పడం ఆత్మగౌరవాన్ని తగ్గించదు, వ్యక్తిత్వాన్ని గొప్పగా చూపిస్తుంది.

ఒక్కసారి ఆలోచించండి.. మన జీవితంలో మనకు ఎదురయ్యే సమస్యలన్నీ శాశ్వతమైనవి కావు. ఈరోజు పెద్దదిగా కనిపించే సమస్య రేపటికి చిన్నదిగా మారిపోవచ్చు. కానీ ఆ సమస్య సందర్భంగా మనం ఒకరినొకరు బాధపెట్టిన మాటలు మాత్రం ఎన్నో ఏళ్లపాటు గుర్తుండిపోవచ్చు. అందుకే మాట్లాడే ముందు క్షణం ఆలోచించాలి. మన మాట సమస్యను పరిష్కరిస్తుందా? లేక బంధంలో మరో గాయాన్ని సృష్టిస్తుందా? అని ప్రశ్నించుకోవాలి.

జీవితం అంటే ప్రతి సందర్భంలోనూ గెలవడం కాదు. మనతో కలిసి నడిచే మనుషులను కోల్పోకుండా ముందుకు సాగడం. ఒక వాదనలో గెలిచి మనిషిని ఓడించడం కంటే, ఇద్దరూ కలిసి సమస్యను ఓడించడం ఎంతో గొప్ప విషయం. ఎందుకంటే నిజమైన బంధంలో గెలుపు ఒకరిది కాదు.. ఇద్దరిదీ కావాలి.

గుర్తుంచుకోండి.. సమస్య వచ్చినప్పుడు 'ఎవరిది తప్పు?' అని ప్రశ్నించే బదులు 'దీనిని ఎలా పరిష్కరించుకుందాం?' అని అడగండి. మీ బంధం బలపడటమే కాదు.. మీ జీవితం కూడా మరింత ప్రశాంతంగా మారుతుంది. బంధంలో గెలుపోటములు ఉండకూడదు, అక్కడ ఉండాల్సింది పరస్పర అవగాహన, గౌరవం, కలిసి ముందుకు సాగాలనే సంకల్పం మాత్రమే!


యువత - ఏఐ వైరుధ్యం!



దశాబ్దాలుగా భారత్ తన అతిపెద్ద బలంగా చెప్పుకుంటున్నది యువ జనాభాను. పెరుగుతున్న శ్రామిక శక్తి, యువత ఆకాంక్షలే దేశ ప్రగతికి ఇంజిన్లుగా నమ్మారు. కానీ ఇప్పుడు విచిత్రమైన వైరుధ్యం కనిపిస్తోంది. కోట్లాది యువకులు ఉద్యోగాలకు సిద్ధమవుతుంటే.. కంపెనీలు తక్కువ సంఖ్యతోనే పనులు పూర్తి చేసే మార్గాలను కనిపెడుతున్నాయి. ఉత్పత్తి రెట్టింపైన ఉద్యోగుల సంఖ్యను పెంచనవసరం లేని పరిస్థితి వాటాదారులకు లాభం. కానీ ఉద్యోగం కోసం ఎదురుచూసే యువతకు అది ఆందోళన కలిగించే ప్రశ్న. అంతర్జాతీయ ద్రవ్య నిధి విశ్లేషణ ప్రకారం భారత్‌లో సుమారు 26 శాతం ఉపాధి ఏఐ ప్రభావానికి ఎక్కువగా లోనయ్యే రంగాల్లో ఉంది. అయితే మన దేశంలో ఎక్కువ మంది వ్యవసాయ, చేతివృత్తుల వంటి తక్కువ నైపుణ్య పనుల్లో ఉన్నారు కాబట్టి మొత్తం ప్రభావం తక్కువేనని ఆ సంస్థ చెప్పింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ 2025 అధ్యయనం ప్రకారం ప్రపంచంలో నలుగురిలో ఒకరి ఉద్యోగం జనరేటివ్ ఏఐకి లోనయ్యే అవకాశం ఉంది. అయితే చాలా ఉద్యోగాలు పూర్తిగా పోవడం కంటే రూపం మారడమే ఎక్కువని కూడా అంది. కానీ భారత్‌లో ఈ మార్పు సాఫ్ట్‌వేర్ రంగంలో ఇప్పటికే కనిపిస్తోంది. ఐటీలో కొత్త గ్రాడ్యుయేట్ల నియామకాలు 2021-22లో సుమారు ఆరు లక్షలుండగా, 2024-25 నాటికి సుమారు 1.2 లక్షలకు పడిపోయాయని ఒక సంస్థ అంచనా. 2025-26లో అగ్రశ్రేణి ఐటీ కంపెనీల మొత్తం ఉద్యోగుల సంఖ్య 7 వేలకు పైగా తగ్గింది. అయితే ఇదంతా నిరాశే కాదు. బ్యాంకులు, తయారీ, ఆరోగ్య రంగం, అంతర్జాతీయ సంస్థల భారత కేంద్రాలు నియామకాలు చేస్తున్నాయి. ఈ ఏడాది సాంకేతిక నిపుణులకు డిమాండ్ 10 శాతం పెరిగినా, కొత్తగా చేరేవారిలో ఐటీ సేవల కంపెనీల వాటా 32 శాతం నుంచి 24 శాతానికి తగ్గింది. అంటే పని పోవడం కాదు, పని ఉన్న చోటు, అడిగే నైపుణ్యాలు మారుతున్నాయి. నిచ్చెన మొదటి మెట్టు తీసేస్తే, ఎక్కడం మొదలుపెట్టేవారికి దారే ఉండదు. ఇంజినీరింగ్ చదివితే ఉద్యోగం గ్యారంటీ అనే నమ్మకంతో ఎన్నో కుటుంబాలు అప్పులు చేసి పిల్లలను చదివించాయి. ఆ నమ్మకం ఇప్పుడు కదులుతోంది. ఈ ధోరణి ఇతర రంగాలకూ విస్తరిస్తే యువ జనాభా బలం భారంగా మారే ప్రమాదముంది. జనాభా లాభం దానంతట అదే రాదు. యువతకు తగిన పని దొరికినప్పుడే అది లాభం, లేకపోతే కేవలం ఒక సంఖ్య. ఏఐకి లోనయ్యే ఉద్యోగం అంటే పోయే ఉద్యోగం కాదు. ఆదా అయిన సమయంలో ఉద్యోగి విలువైన పనులు చేయవచ్చు, లేదా యాజమాన్యం ఉద్యోగిని తగ్గించవచ్చు. గతంలో కంప్యూటర్లు వచ్చినప్పుడు కూడా ఇలాంటి భయాలే వచ్చాయి, కొత్త రంగాలు పుట్టి ఉద్యోగాలూ పెరిగాయి. కానీ ఈసారి మార్పు వేగం. కొత్త ఉద్యోగాలు వచ్చేలోపు పాత ఉద్యోగాలు పోతే మధ్యలో నలిగిపోయే తరం ఉంటుంది. భవిష్యత్.. కంపెనీల నిర్ణయాలపై, ప్రభుత్వ విధానాలపై ఆధారపడి ఉంటుంది.

ఈ ఆందోళన విద్యారంగంలో మరింత తీవ్రంగా కనిపిస్తుంది. తరగతి గదుల్లో టీచర్లు ఇప్పటికే కష్టపడి చదవమని, సర్టిఫికెట్లు సంపాదించమని చెబుతున్నారు. కానీ ఆ పిల్లలు చేరబోయే పని ప్రపంచం విద్యా వ్యవస్థ వేగానికంటే వేగంగా మారుతోంది. ప్రభుత్వ కార్మిక శక్తి సర్వే ప్రకారం ఈ ఏడాది జూన్‌లో 15-29 ఏళ్ల యువతలో నిరుద్యోగం 16.2 శాతం ఉంది. సెప్టెంబరులో పట్టణ యువతలో అది 19 శాతానికి, యువతులలో 26.6 శాతానికి చేరింది. ఇవి నెలవారీ అంచనాలు, గత ఏడాది వార్షిక సర్వేలో యువత నిరుద్యోగం 9.9 శాతంగా నమోదైంది, కాబట్టి సంఖ్యలను జాగ్రత్తగా చూడాలి. అయినా దిశ స్పష్టంగా ఉంది. యువ గ్రాడ్యుయేట్లలో దాదాపు 40 శాతం ఇంకా ఉద్యోగం వెతుక్కుంటున్నారని అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం నివేదిక చెబుతోంది. ఒక విశ్లేషణ ప్రకారం 15-29 ఏళ్ల ప్రతి వంద మంది గ్రాడ్యుయేట్లలో 26 మందికే క్రమం తప్పని జీతం ఉన్న ఉద్యోగముంది. అంటే ఏఐ రాకముందే మన విద్యకు, ఉపాధికి మధ్య దూరముంది. ఏఐ ఆ దూరాన్ని పెంచుతుందేమో అన్నదే భయం. పైగా "నైపుణ్యాలు మార్చుకోండి" అనే సలహా అన్ని ప్రశ్నలకూ సమాధానం కాదు. కొత్త నైపుణ్యాలకు డబ్బు, సమయం కావాలి. నలభై ఏళ్ల ఉద్యోగి కుటుంబాన్ని పోషిస్తూ పూర్తిగా కొత్త నైపుణ్యాలు ఎలా నేర్చుకోవాలి? ఆ ఖర్చు ఎవరు భరిస్తారు? శిక్షణ కాలంలో ఆదాయం ఎలా? ఈ ప్రశ్నలకు సమాధానం లేకుండా కేవలం నేర్చుకోమని చెప్పడం బాధ్యత నుంచి తప్పించుకోవడమే. ఏ విద్యా సంస్థా ప్రతి సాంకేతిక మార్పునూ ముందే ఊహించలేదు. ఆర్థిక సర్వే 2024-25 కూడా ఏఐ ప్రభావం, ముఖ్యంగా కొత్తగా చేరేవారి ఉద్యోగాలపై ఆందోళన కలిగిస్తోందని, శ్రమ ఎక్కువగా ఉన్న మన ఆర్థిక వ్యవస్థ పెద్దఎత్తున ఉద్యోగ నష్టాన్ని భరించలేదని హెచ్చరించింది. మన శ్రామికుల్లో అధికులు అసంఘటిత రంగమే. వారికి భద్రత తక్కువ. కాబట్టి ఈ హెచ్చరికను కేవలం ఐటీ ఉద్యోగుల ఆందోళనగా చూడకూడదు. ఇది దేశ ఆర్థిక నిర్మాణానికి సంబంధించిన ప్రశ్న.

ప్రభుత్వం కూడా ఈ ప్రశ్నను గుర్తించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఉపాధికి ప్రాధాన్యం ఇచ్చారు. ఏఐ ఉద్యోగాలను తీసేయదని, పెంచగలదని ప్రభుత్వం చెప్పింది. ప్రధాన ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ ఏఐని భారీ స్థాయిలో ఉద్యోగాలు సృష్టించేలా ఉద్దేశపూర్వకంగా నడపాలని అన్నారు. సుమారు పదివేల మూడు వందల కోట్ల రూపాయలతో ఇండియా ఏఐ మిషన్ నడుస్తోంది. నైపుణ్య శిక్షణ శాఖ కూడా మూడు స్థాయిల శిక్షణ విధానాన్ని ప్రకటించింది. ఇవన్నీ మంచి మొదటి అడుగులే. కానీ లక్ష్యాలు చెప్పడం ఒక ఎత్తు, పని ఉన్నవారికి కొత్త నైపుణ్యాలు నేర్పి కొత్త ఉద్యోగాలు ఇప్పించడం మరో ఎత్తు. ఈ బాధ్యత వ్యక్తుల భుజాలపైనే పడకూడదు. ప్రభుత్వాలు ఉపాధికి ఉపయోగపడే విద్యను విస్తరించాలి, ఉద్యోగం కోల్పోయినవారికి సామాజిక భద్రత కల్పించాలి. కంపెనీలు ఉత్పాదకత పెరిగితే సామాజిక బాధ్యత కూడా పెరుగుతుందని గుర్తించాలి. కనీసం కొత్తగా చేరేవారికి శిక్షణ ఇచ్చే అవకాశాలనైనా మూసేయకూడదు. ఎందుకంటే ఈ రోజు ఫ్రెషర్‌కు ఇచ్చే శిక్షణే రేపటి సీనియర్‌ను తయారు చేస్తుంది. విద్యా సంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వడమే కాదు, ఆలోచించడం, విమర్శనాత్మకంగా చూడటం, సరైన నిర్ణయం తీసుకోవడం నేర్పాలి. యంత్రాలు చేయలేని విషయాలు అవే. సానుభూతి, సృజనాత్మకత, నైతిక విచక్షణను పాఠశాల స్థాయి నుంచే పెంచాలి. చిన్న వ్యాపారాలకు, గ్రామీణ ప్రాంతాలకు, స్థానిక భాషల్లో చదివినవారికి ఏఐ ఫలాలు అందేలా చూడటం కూడా అవసరం. లేకపోతే ఈ మార్పు కొందరికే లాభం ఇచ్చి, మిగిలినవారిని వెనక్కి నెట్టేస్తుంది. యువత కూడా నేర్చుకునే అలవాటును జీవితకాల అవసరంగా చూడాలి. అయితే ఆ బాధ్యత పూర్తిగా వ్యక్తులపైనే వదిలేయడం న్యాయం కాదు. సాంకేతిక పురోగతిని అడ్డుకోవడం మూర్ఖత్వం. కానీ సామర్థ్యాన్ని మెచ్చుకుంటూ, దాని అర్థం మనుషులకు ఏమిటో అడగకపోవడం కూడా అంతే మూర్ఖత్వం. దేశ అభివృద్ధిని కేవలం ఆదాయం, అధునాతన సాంకేతికత లేదా జీడీపీతో కొలవలేం. ప్రజలకు దక్కే గౌరవం, భద్రత, అవకాశాలతోనే కొలవాలి. యంత్రాలకు మనుషుల్లా ప్రవర్తించడం నేర్పడం భారత్ అసలు సమస్య కాదు. ఆ ప్రయత్నంలో మనుషుల విలువ తగ్గకుండా చూడటమే అసలు సవాలు. ■




ఆరోగ్యం అడుక్కుంటే వచ్చేది కాదు, సరైన అలవాట్లను ఆచరిస్తే దక్కుతుంది. సమయానికి తినడం, శరీరానికి తగినంత శ్రమ కల్పించడం, మనసుకు ప్రశాంతతనిచ్చే పనులు చేయడం, హాయిగా నిద్రపోవడం.. ఇవన్నీ ఆరోగ్యానికి మనం ఇచ్చే చిన్న చిన్న కానుకలు. రేపు అనారోగ్యం వస్తే ఏం చేయాలా అని ఆలోచించడం కంటే, ఈరోజు అనారోగ్యం రాకుండా ఎలాంటి జీవనశైలిని అలవర్చుకోవాలో ఆలోచించండి. గుర్తుంచుకోండి.. ఆరోగ్యం కోసం సమయం కేటాయించని వారు, అనారోగ్యం వచ్చినప్పుడు తప్పనిసరిగా సమయం కేటాయించాల్సి వస్తుంది!

-మహాదేవ

వింతల్లో వింతలు

సెకన్లలో.. స్టాట్యూ ఆఫ్ లిబర్టీని గీసేశాడు..!



కళకు వేగం తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని నిరూపించాడు అమెరికాకు చెందిన డేవిడ్ గరిబాల్డి. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ దే సందర్భంగా ఆయన కేవలం 43.5 సెకన్లలోనే అమెరికా చిహ్నమైన స్టాట్యూ ఆఫ్ లిబర్టీ చిత్రాన్ని గీసి సరికొత్త ప్రపంచ రికార్డు సాధించాడు. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ వాటర్‌ఫ్రంట్ వద్ద ప్రేక్షకుల సమక్షంలో ఆకుపచ్చ, నీలం రంగులతో వేగంగా పెయింటింగ్ వేసిన ఆయన.. చివర్లో కాన్వాస్‌ను తిప్పగానే లేడీ లిబర్టీ ముఖచిత్రం ఆవిష్కృతమైంది. దీంతో ల్యాండ్‌మార్క్ విగ్రహాన్ని అత్యంత వేగంగా చిత్రించిన కళాకారుడిగా గిన్నిస్ గుర్తింపు పొందాడు.



‘జనవరి 12 విడుదల’ నుంచి ఫస్ట్ సింగిల్ ‘దివికి దివికి’ విడుదల!

అగ్ర కథానాయకులు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం ‘జనవరి 12 విడుదల’. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఘనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా సినిమాలోని తొలి పాట ‘దివికి దివికి’ సంబంధించిన సాంగ్ ప్రోమోను తాజాగా విడుదల చేసింది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా.. మధుప్రియ, హరిప్రియ కలిసి పాడారు. అనంత్ శ్రీరామ్ లిరిక్స్ అందించాడు. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ‘జనవరి 12 విడుదల’పై ఆరంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.

బెల్లంకొండ ‘హైందవ’ విడుదలకు బ్రేక్..
త్వరలోనే కొత్త రిలీజ్ డేట్ ప్రకటిస్తామన్న మేకర్స్!



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త జంటగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం ‘హైందవ’ విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ మూన్‌షైన్ పిక్చర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా ఈ ఏడాది నవంబర్ 27న థియేటర్లలో విడుదల కావాల్సి ఉంది. అయితే అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు ఒక మంచి సినిమాటిక్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు నిర్మాతలు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని పేర్కొంటూ, ప్రేక్షకుల సహనానికి, నిరంతర మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. గత నెలలో విడుదలైన ఈ సినిమా టీజర్‌కు సినీ ప్రియుల నుంచి విశేష స్పందన లభించింది. రంగాపురం అనే గ్రామ నేపథ్యంలో సాగే ఈ మిస్టరీ థ్రిల్లర్ కథాంశం ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామంలోని ఒక పురాతన ఆలయంలోని విగ్రహాలన్నీ మాయమవడం, అదే సమయంలో ఒక గ్రామస్థుడు హత్యకు గురికావడంతో కథ మలుపు తిరుగుతుంది. అయితే నిర్ణీత గడువులోగా ఆ విగ్రహాలన్నీ తిరిగి వస్తాయని ఆలయ పూజారి విశ్వసిస్తుంటారు. ఈ వింత కేసును దర్యాప్తు చేసేందుకు దేవుడి కంటే మానవత్వాన్ని నమ్మే ఒక నాస్తికుడైన పోలీసు అధికారి రంగంలోకి దిగడంతో నమ్మకానికి, హేతువాదానికి మధ్య జరిగే ఆసక్తికరమైన సంఘర్షణతో ఈ చిత్రం సాగనుంది. మహేష్ చందు నిర్మిస్తున్న ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నాస్తిక పోలీసు అధికారిగా నటిస్తుండగా, సంయుక్త కథానాయికగా కనిపించనుంది. ఆలయ పూజారి పాత్రలో మహేష్ మంజ్రేకర్ కీలక పాత్ర పోషిస్తుండగా, సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ ఆకల్ట్ థ్రిల్లర్‌కు సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, హరీష్ కన్నన్ సినిమాటోగ్రఫీ, కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్, శివ కామేష్ డి ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఇదెక్కడి ట్విస్ట్.. హనుమాన్ సీక్వెల్లో మెగా హీరో..!

ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ మూవీ హనుమాన్. తేజ సజ్జా హీరోగా వచ్చిన ఈ సినిమా.. బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో ఈ మూవీకి సీక్వెల్ జై హనుమాన్ ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుతం సీక్వెల్‌తో ఫుల్ బిజీగా ఉన్నారు ప్రశాంత్ వర్మ. ఈ చిత్రంలో కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి హనుమంతుడిగా కనిపించనున్నారు.
తాజాగా ఈ సీక్వెల్ తెరకెక్కుతుండగానే టాలీవుడ్‌లో మరో బిగ్ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు. మెగా హీరో వైష్ణవ్ తేజ్ లీడ్ రోల్లో హనుమాన్- ది రైజ్ ఆఫ్ వానరాస్(హనుమాన్-2) మూవీ ప్రకటించారు. ఈ చిత్రానికి వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు. దీంతో టాలీవుడ్ ఫ్యాన్స్ డైలామాలో పడ్డారు. అసలు ఇది హనుమాన్ సీక్వెల్ మూవీనా?.. లేదంటే కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారా అనేది తెలియాల్సి ఉంది. ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో వచ్చిన హనుమాన్ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ ప్రాజెక్ట్ ప్రకటించడం మరో విశేషం. అయితే అయితే పార్ట్ -1 నిర్మించిన ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ వారు కూడా ఇప్పుడు ‘హను మాన్ 2’ ని మరో హీరోతో తీసుకురాబోతున్నట్టుగా ఇటీవల రూమర్స్ గట్టిగా వినిపించాయి. తాజాగా అదే సమయంలో వాటిని నిజం చేస్తూ మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చి షాకిచ్చారు. మెగా యంగ్ హీరో పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా పెట్టి హనుమాన్- 2 ప్రీ లుక్ పోస్టర్ రిలీజ్ చేయడం టాలీవుడ్‌లో ఆసక్తిగా మారింది.



కూతురితో సరదాగా ..
ఎమోషనల్ పోస్ట్ షేర్ చేసిన అల్లు అర్జున్!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన సినిమాలతోనే కాకుండా కుటుంబానికి సంబంధించిన మధురమైన క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. ముఖ్యంగా తన పిల్లలతో కలిసి గడిపే సమయానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులను ఆనందపరుస్తుంటారు. తాజాగా తన గారాల పట్టి అల్లు అర్హా పుట్టినరోజు సందర్భంగా అల్లు అర్జున్ చేసిన ఓ ప్రత్యేక పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నేడు అల్లు అర్హా పుట్టినరోజు కావడంతో బన్నీ తన కుమార్తెకు ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అల్లు అర్హాతో కలిసి ఉన్న ఓ అందమైన ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ఈ ఫొటోకు అదిరిపోయే క్యాప్షన్ కూడా జోడించారు. నా జీవితంలోని ఆనందానికి పుట్టినరోజు శుభాకాంక్షలు” అంటూ చూశ్రీశ్రీబాతీష్ట్ర హ్యాష్‌ట్యాగ్‌తో తన ప్రేమను వ్యక్తం చేశారు. తండ్రిగా తన కుమార్తెపై ఉన్న ప్రేమను ఈ చిన్న మాటల్లో ఎంతో అందంగా తెలియజేశారు. ఈ పోస్ట్ షేర్ చేసిన కొద్ది సమయంలోనే అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఇప్పటికే ఈ ఫొటోకు 3 లక్షలకు పైగా లైక్స్ వచ్చాయి. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు అల్లు అర్హాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అల్లు అర్జున్‌కు సంబంధించిన ఈ ఫ్యామిలీ పోస్ట్ అభిమానులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. తెరపై స్టైలిష్ స్టార్‌గా, మాస్ హీరోగా కనిపించే బన్నీ.. వ్యక్తిగత జీవితంలో తన పిల్లలతో ఎంతో ప్రేమగా ఉండే తండ్రిగా కనిపించడం అభిమానులకు ఆనందాన్ని కలిగిస్తోంది. ఇక అల్లు అర్జున్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ఫాంటసీ యాక్షన్ చిత్రం ‘రాకా’లో నటిస్తున్నారు. ఈ సినిమాలో దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో పాటు దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో కూడా అల్లు అర్జున్ ఓ సినిమా చేయాల్సి ఉంది. ఇలా వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న బన్నీ.. మరోవైపు కుటుంబానికి కూడా తగినంత సమయం కేటాయిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

సుకుమార్‌తో రామ్ చరణ్.. రహస్య ప్రదేశానికి చెర్రీ...!





మెగాస్టార్ తనయుడు రామ్ చరణ్ మరో మూవీకి రెడీ అయిపోయారు. ఈ ఏడాది పెద్దితో అలరించిన చెర్రీ.. సుకుమార్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ సినిమా ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ చిత్రాన్ని ప్రస్తుతం ఆర్సీ17 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కించనున్నారు. ఈ డిసెంబర్ నుంచే షూటింగ్ సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే రామ్ చరణ్‌కు సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సుకుమార్ మూవీ కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫామ్ అయ్యేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. దాదాపు మూడు రోజుల పాటు తన లుక్‌ను మార్చుకునేందుకు విరామం తీసుకున్నట్లు సమాచారం. ఎవరికీ తెలియని ఓ సీక్రెట్ లోకేషన్‌లో రామ్ చరమ్ ట్రాన్స్‌ఫార్మేషన్‌కు సిద్ధమవుతున్నారని టాక్. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రైనర్, చెఫ్‌లతో సహాయక సిబ్బంది రామ్ చరణ్‌తోనే ఉండనున్నారు. ఈ మూవీ కోసం రామ్ చరణ్ పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా కోసం పెద్ది సినిమాలోని లాంగ్ హెయిర్‌ను వదిలేసి లావుతగ్గడం మొదలెట్టారు. తాజాగా రామ్ చరణ్ ఎయిర్‌పోర్ట్‌లో వెళ్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. రంగస్థలం తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తోన్న మూవీ కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com